మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 25-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 57 Issue: 57

25 ఆగస్టు 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:31 తిథి ద్వాదశి ఉ. 6:21 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ రా. 10:40 వరకు తరువాత శ్రవణ యోగం ఆయుష్మాన్ ఉ. 7:39 వరకు కరణం భాలవ ఉ. 6:21 వరకు కౌలవ రా. 7:10 వరకు వర్జ్యం తె. 5:16 నుండి ఉ. 7:02 వరకు దుర్ముహూర్తం ఉ. 8:34 నుండి ఉ. 9:24 వరకు రా. 11:09 నుండి రా. 11:55 వరకు రాహుకాలం మ. 3:24 నుండి సా. 4:58 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:44 వరకు గుళికాకాలం మ. 12:18 నుండి మ. 1:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు మ. 3:48 నుండి సా. 5:33 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# కొండా తప్పుకో!

### సురేఖ రాజీనామాకు హైకమాండ్ ఆదేశం?
### మంత్రి పదవి నుంచి తప్పుకోవాలని హుకుం
### మల్లికార్జున ఖర్గేను కలిసినా దక్కని భరోసా!



దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు ఓ సీనియర్ మంత్రి ద్వారా ఆమెకు సమాచారం చేరవేసినట్లు తెలిసింది. హై కమాండ్ ఆదేశాలను పాటించాలని ఆమెకు స్పష్టం చేసినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత .. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలను పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది.

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి, కాంగ్రెస్ ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ వేర్వేరుగా అధిష్టానానికి నివేదికలు పంపినట్లు తెలిసింది. గతంలో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మరో ఇద్దరు మంత్రులు జోక్యం చేసుకోగా, పార్టీకి నష్టం కాకూడదనే కోణంలో వారు కలగజేసుకొని సమస్యను సమసిపోయేలా చేశారు. అయితే ఈ సారి కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యల తీవ్రత దృష్ట్యా అధిష్టానం చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. గతంలో సురేఖ వ్యవహారంలో కలగజేసుకున్న సీనియర్ మంత్రికే ..అధిష్టానం నేరుగా

**సురేఖకు తెలీకుండానే డిప్యూటేషన్లు రద్దు** 2



# ప్రధానికి పరిజ్ఞానమేలే!

### ఇంకా గుజరాతీగానే వ్యవహారం.. 'అమెరికా' అనుమతి నిరాకరణ
### తెలంగాణకు ఘోర అవమానం.. మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వ్యక్తిగతంగా తనకు జరిగిన తిరస్కరణ కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు.

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో పెట్టుబడులు, విద్య, క్రీడలను ప్రోత్సహించేందుకు విదేశీ పర్యటనలు చేపడుతున్నామని రేవంత్ తెలిపారు. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతించి, అదే ఉద్దేశాలతో చేపట్టిన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై ఆయన తరువాయి 2 వ పేజీలో...



# మిస్ యూనివర్స్ ఇండియాగా కజియా

'మిస్ యూనివర్స్ ఇండియా' 2026 పోటీల్లో కజియా లిజ్ మెజో విజేతగా నిలిచింది. జైపూర్‌లోని జీ స్టూడియలో జరిగిన అందాల పోటీల గ్రాండ్ ఫినాలేలో ఈ కేరళ అమ్మాయిని కిరీటం వరించింది.

# రెండ్రోజులు భారీ వానలు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది.

# సైబర్ జిహాద్

### పెద్దపల్లిలో ఉగ్ర లింకుల కలకలం.. ఎన్ఐఏ అదుపులో డిప్లొమా విద్యార్థి



పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన డిప్లొమా విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

రామగుండం, ఆగస్టు 24 (ఈవార్తలు): ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతని టెలిగ్రామ్ గ్రూపులోని వ్యక్తులు, వారి మధ్య చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జరిగిన ఆన్‌లైన్ సంభాషణలు, యువకుడికి ఉన్న సంబంధాలపై సమాచారం రావడంతో ఉదయాన్నే అధికారులు రంగంలోకి దిగారు. టెలిగ్రామ్ గ్రూపులోకి వ్యక్తుల వివరాలపై ఆరా తీసినట్లు సమాచారం. ముఖ్యంగా టెలిగ్రామ్‌లోని వ్యక్తులకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయని అధికారులు అనుమానిస్తున్నారు. తనిఖీల అనంతరం అతడికి సంబంధించిన డిజిటల్ పరికరాలను అధికారులు పరిశీలించి, ల్యాప్‌టాప్, ఫోన్ సహా అన్నీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఉగ్రవాదులతో విద్యార్థికి ఎలాంటి లింకులు ఉన్నాయి, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు తరువాయి 2 వ పేజీలో...

# లవ్ జిహాద్

### సాదిక్ ఖాన్ వేధింపుల వల్లే ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య
### 10 మందితో టెర్రరిస్ట్ గ్యాంగ్.. ఇది కచ్చితంగా లవ్ జిహాదే
### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. బాధిత కుటుంబానికి పరామర్శ
### నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధింపు





కాకినాడ, ఆగస్టు 24 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం తరువాయి 2 వ పేజీలో...

**మూడో శ్రావణ శుక్రవారం నాడు పార్టీని ప్రకటిస్తా**
**మాజీ ఎంపీ విజయ్ సాయిరెడ్డి కీలక ప్రకటన** 2

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,397 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,781 |



# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులతో సీఎం రేవంత్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి అని సీఎం ఆదేశించారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావు అని ఆయన అన్నారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, ఫారెస్టు తరువాయి 2 వ పేజీలో...

# నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

### జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన
### జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ తరువాయి 2 వ పేజీలో...



# చెక్కులివ్వడానికి ఎమ్మెల్యేలెవరు?

### కల్యాణలక్ష్మి చెక్కులు వాళ్లెలా ఇస్తారు?
### తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యేలు పంపిణీ చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనికి సంబంధించిన చెక్కులను అధికారులు ఇవ్వకుండా ఎమ్మెల్యేలు ఇవ్వడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఈ చెక్కుల పంపిణీ అంశంలో సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది.

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): అదే సమయంలో దివ్యాంగులకు ఇచ్చే ఆర్థికసాయం కొనసాగించేందుకు అనుమతించిన తెలంగాణ హైకోర్టు.. జీవో నంబర్ 4పై ఉన్న స్టేను ఎత్తివేసింది. కాగా, ఈ నెల ఆరంభంలో ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే. ఆగస్టు 7వ తేదీన ఒక కేసు విచారణ సందర్భంగా.. కోటీశ్వరులు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని వ్యాఖ్యానించింది. రైతుల కోసం అమలు చేసిన రైతు బంధు వంటి పథకాలలోనూ సంపన్నులు లబ్ధి పొందిన విషయాన్ని తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ముక్కు లోపల ఉండే చిన్న నిర్మాణాన్ని వోమెరోనాసల్ ఆర్గన్ (జాకబ్సన్ అవయవం) అంటారు. పాములు, పిల్లులు, ఎలుకలు వంటి జంతువుల్లో ఇది ఫెరోమోన్లను గుర్తించి జతను వెతకడం, కుటుంబ సభ్యులను గుర్తించడం, ప్రమాదాన్ని పసిగట్టడం వంటి ప్రవర్తనలను ప్రభావితం చేస్తుంది. మనుషుల్లో ఈ అవయవం పుట్టుకకు ముందే అభివృద్ధి చెందినప్పటికీ, పెద్దయ్యాక దాని అవశేషాలు మాత్రమే కనిపిస్తాయి. ఫెరోమోన్లను గుర్తించే నాడీ వ్యవస్థ, మెదడు అనుసంధానాలు మనుషుల్లో క్రియాశీలంగా లేవని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందువల్ల మనుషుల్లో జాకబ్సన్ అవయవం ప్రస్తుతం పనిచేయని అవశేష నిర్మాణమే అని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# బడుల బూజు దులిపేద్దాం

### సర్కారీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలేవి?
### విద్యను అత్యంత ప్రాధాన్య అంశంగా చూడాలి
### అన్ని రాష్ట్రాల విద్యాశాఖమంత్రులకు సీజేపీ లేఖ



దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) సంస్థ కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధి అభిజీత్ దీప్కే, అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులకు లేఖలు రాశారు. విద్యను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

న్యూఢిల్లీ: ప్రభుత్వ పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధ్యాయ ఖాళీలు వంటి కీలక అంశాలకు సంబంధించి రాష్ట్రాల వారీగా సమగ్రమైన, పారదర్శకమైన గణాంకాలను అందజేయాలని అభిజీత్ దీప్కే కోరారు. దేశంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రస్తుత దుస్థితిపై సీజేపీ ఆందోళన వ్యక్తం చేసింది. వివిధ రాష్ట్రాల్లోని పాఠశాలల స్థితిగతులను బేరీజు వేయడానికి, వ్యవస్థలోని లోపాలను గుర్తించి సరిదిద్దడానికి ఈ సమాచారం ఎంతో దోహదపడుతుందని సంస్థ అభిప్రాయపడింది. వివిధ రాష్ట్రాల నుంచి తరువాయి 2 వ పేజీలో...

# 2029లోనే జమిలి!

### 99 శాతం మంది ప్రతిపాదనకు మద్దతిచ్చారన్న జేపీసీ చైర్మన్
### పార్లమెంటరీ కమిటీలో పాల్గొన్న ప్రియాంక, చిదంబరం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ముందుగా అంచనా వేసిన 2034 కంటే ఐదేళ్ల ముందే, అంటే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే జమిలి ఎన్నికలు నిర్వహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై అధ్యయనం చేస్తున్న పార్లమెంటరీ జాయింట్ కమిటీ (జేపీసీ) చైర్మన్ పి.పి. చౌదరి ఈ మేరకు కీలక సంకేతాలిచ్చారు. - 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

25.8.2026

**మేషం:** ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపార విషయంలో కుటుంబ పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. ఇంటాబయట మానసిక సమస్యలు చికాకు పరుస్తాయి.

**వృషభం:** నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. పాత ఋణాలు తీర్చగలరు. వ్యాపార విస్తరణకు పెట్టుబడులు అందుతాయి. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**మిధునం:** వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. మిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు కలుగుతాయి. అనుకున్న పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఇంటాబయట నూతన సమస్యలు తప్పవు. మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి లభిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ హోదా పెరుగుతుంది. విద్యార్థుల నూతన విద్యావకాశములు లభిస్తాయి. సన్నిహితుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

**సింహం:** ఉద్యోగస్తులకు పని ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. బంధు మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని వ్యవహారాలు పూర్తి చేస్తారు. ఆర్థిక వాతావరణం ఆశించిన విధంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**కన్య:** వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆదాయానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధు మిత్రులతో ఊహించని కలహాలు కలుగుతాయి.

**తుల:** నిరుద్యోగులకు ప్రయత్నాలు ఫలించవు. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలలో నిలకడ లోపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో అకారణ వివాదాలు కలుగుతాయి.

**వృశ్చికం:** సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు.

**ధనస్సు:** వృత్తి వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు అధికారులు అనుగ్రహంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు. శుభకార్యాలకు హాజరవుతారు. ఇంటా బయట మానసిక ప్రశాంతత కలుగుతుంది. చేపట్టిన వ్యవహారాలు విజయవంతంగా పూర్తి చేస్తారు.

**మకరం:** వ్యాపార ఉద్యోగాలు కొంత నిదానంగా సాగుతాయి. బంధు వర్గంతో విభేదాలు కలుగుతాయి. అనుకున్న సమయానికి డబ్బు చేతికి అందక ఇబ్బంది పడతారు. దైవ చింతన పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**కుంభం:** వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు కలిసిరావు. వృత్తి ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు తప్పవు. మిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. ఖర్చుల విషయంలో ఆలోచించి వ్యవహరించడం మంచిది. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు.

**మీనం:** వృత్తి వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. సమాజంలో పేరు కలిగిన వ్యక్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగమున నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. పాతమిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

# మిస్ యూనివర్స్ ఇండియాగా కజియా

జైపూర్: 'మిస్ యూనివర్స్ ఇండియా' 2026 పోటీల్లో కజియా లిజ్ మెజో విజేతగా నిలిచింది. జైపూర్‌లోని జీ స్టూడియలో జరిగిన అందాల పోటీల గ్రాండ్ ఫినాలేలో ఈ కేరళ అమ్మాయిని కిరీటం వరించింది. టైటిల్ పోరులో ఏకంగా 52 మందిని ఓడించిన 19 ఏళ్ల కజియా తన కలను సాకారం చేసుకుంది. ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేలో అందంతో పాటు తెలివితేటలతోనూ జడ్జిలను మెప్పించింది. ఈ టైటిల్ గెలుపొందిన మొట్టమొదటి కేరళ కుట్టిగా కజియా రికార్డు నెలకొల్పింది. మాజీ మిస్ యూనివర్స్ ఇండియా మనికా విశ్వకర్మ ఆమెకు కిరీటాన్ని ప్రదానం చేసింది. దేశపు తొలి మిస్ యూనివర్స్ సుస్మితా సేన్, మాజీ మిస్ యూనివర్స్ ఊర్వశీ రౌతేలా, మిస్ యూనివర్స్ ఇండియా 2024 రియా సింఘా, పర్యావరణవేత్త.. సినిమా ప్రొడ్యూసర్ ప్రగ్యా కపూర్, మాజీ మిస్ ఇండియా యూనివర్స్, మిస్ యూనివర్స్ రన్నరప్ సెలీనా జైట్లీలు ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మిస్ యూనివర్స్ ఇండియా టైటిల్ గెలుపొందడంతో తన మూడేళ్ల కల నిజమైందని కజియా చెప్పింది. 'ఇప్పుడు నేను ప్రపంచం మీద ఉన్నట్టు అనిపిస్తోంది. ఇదొక మధుర క్షణం. ఈ సందర్భం కోసం మూడేళ్లుగా ఎదురుచూస్తున్నా. ఈ అందాల కిరీటాన్ని మా స్వరాష్ట్ర కేరళకు తీసుకెళ్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని భావోద్వేగానికి లోనైంది అందగత్తె. అమెరికాలోని ప్యుయెర్టో రికోలో నవంబర్‌లో జరుగనున్న 75వ మిస్ యూనివర్స్ అందాల పోటీల్లో భారత ప్రతినిధిగా కజియా పాల్గొననుంది.




# ప్రధానికి పరిజ్ఞానమేలే!

**మొదటి పేజీ తరువాయి**

ప్రశ్నించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతి ఇచ్చి పెట్టుబడుల కోసం రోడ్‌షోలు నిర్వహించే అవకాశం కల్పించారని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి అదే ఉద్దేశంతో అమెరికా వెళ్తానంటే అనుమతి నిరాకరించడంలో రాజకీయ కారణం ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం వెనుక గుజరాత్ ఆధిపత్యమే కారణమని ఆరోపించిన రేవంత్.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను సహించబోమన్నారు. ఈ అంశాన్ని లోక్‌సభ, రాజ్యసభల్లో తమ పార్టీ నాయకులు ప్రస్తావిస్తారని తెలిపారు. అమెరికా పర్యటనకు సంబంధించి విదేశాంగ శాఖకు సమర్పించిన దరఖాస్తులో విద్య, క్రీడలు, పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించిన వివరాలను స్పష్టంగా పేర్కొన్నామని రేవంత్ చెప్పారు. దరఖాస్తులో వివరాలు లేవని, పర్యటనలో దాపరికం ఉందని బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలు అవాస్తవమన్నారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. ఇంగ్లండ్ పర్యటనలో ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి, యూనివర్సిటీ ఆఫ్ లండన్, లండన్ బిజినెస్ స్కూల్ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో క్యాంపస్‌లు, స్వల్పకాలిక కోర్సుల ఏర్పాటుపై ఆయా సంస్థలు సానుకూలంగా స్పందించాయని వివరించారు. అమెరికా పర్యటనలో హార్వర్డ్, ఎంఐటీ, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతోనూ చర్చలు జరపాలని భావించినట్లు తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకువస్తే విదేశాలకు వెళ్లి చదువుకునే కొద్దిమందికి బదులుగా వేలాది మంది విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి వస్తుందని రేవంత్ పేర్కొన్నారు.

# లవ్ జిహాద్

**మొదటి పేజీ తరువాయి**

బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. అటు.. నిందితుడు సాదిక్ ఖాన్ వేధింపుల వల్లే ఈ ఘోరం జరిగిందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇది సాధారణ వేధింపుల కేసు కాదని, దీని వెనుక పక్కా ప్రణాళికతో కూడిన లవ్ జిహాద్ ఉందని వ్యాఖ్యానించారు. కోనసీమ జిల్లా రావులపాలెంలో నూకరాజు అల్లుడు జగదీశ్వర్ రెడ్డి కుటుంబాన్ని, ప్రాణాలతో బయటపడిన చిన్నారి రియాన్ష్ కార్తికేయ రెడ్డిని విజయసాయిరెడ్డి పరామర్శించారు. ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సాదిక్ ఖాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సాదిక్‌ను కరడుగట్టిన నేరస్థుడిగా అభివర్ణించిన ఆయన, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల్లో సుమారు 15 హిందూ కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నాడని ఆరోపించారు. సాదిక్, మరో తొమ్మిది మంది కలిసి ఒక 'టెర్రరిస్ట్ గ్యాంగ్'గా ఏర్పడ్డారని విజయసాయి ఆరోపించారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని, బలవంతంగా ఇస్లాంలోకి మార్చడం, వారి ఆస్తులను కాజేయడమే ఈ ముఠా లక్ష్యమని అన్నారు. నూకరాజు కుటుంబానికి చెందిన రూ. 40 కోట్ల విలువైన ఆస్తులు, రావులపాలెంలోని 40 సెంట్ల భూమిని సాదిక్ బలవంతంగా రాయించుకున్నాడని తెలిపారు. వీటితో పాటు రూ. 2 కోట్ల బంగారం, రూ. 2 కోట్ల నగదు కూడా తీసుకున్నాడని ఆరోపించారు. గతంలో సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డికి విషం పెట్టి చంపి, ఆ ఇన్సూరెన్స్ డబ్బును కూడా సాదిక్ కాజేశాడని ఆయన చేసిన ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. ఆత్మహత్యకు ముందు సౌజన్య రాసిన లేఖలో అనేక కీలక విషయాలు వెల్లడయ్యాయని అన్నారు. విచారణలో తనకు ఇద్దరు వ్యక్తులు సహకరించారని సాదిక్ చెప్పినట్టు తనకు తెలిసిందని విజయసాయి పేర్కొన్నారు.

## మూడో శ్రావణ శుక్రవారం నాడు

# పార్టీని ప్రకటిస్తా

### మాజీ ఎంపీ విజయ్ సాయిరెడ్డి కీలక ప్రకటన

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): వైసీపీ మాజీ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు ప్రకటించారు. ఈ విషయానికి సంబంధించి ఆయన సోమవారం మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు తదితర పూర్తి ప్రణాళికను తెలియజేస్తానని వెల్లడించారు. విజయవాడ వేదికగా అధికారికంగా ప్రకటన చేస్తానని స్పష్టంచేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరఫున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

# సైబర్ జిహాద్

**మొదటి పేజీ తరువాయి**

తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. సంబంధిత యువకుడిని అవసరమైనప్పుడు విచారణకు హాజరుకావాలని అధికారులు ఆదేశించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారంపై విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశంలోని 54 కీలక ప్రభుత్వ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు జరిగాయి. ప్రభుత్వ కీలక కంప్యూటర్ వనరులు, క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను దెబ్బతీయడమే లక్ష్యంగా ఉగ్రవాదులు కుట్ర పన్నారు. ఈ కేసులో భాగంగానే ముజామిల్ ఖాన్‌ను విచారించినట్లు సమాచారం. కాగా, మూడేళ్ల క్రితం కూడా కరీంనగర్‌లో ఉగ్రలింక్‌లు బయటపడిన విషయం తెలిసిందే. ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయంటూ జగిత్యాలకు చెందిన వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పుడు తాజాగా మరోసారి రామగుండంలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించడం, సోదాలు నిర్వహించడం సంచలనం రేపుతోంది.

# బడుల బూజు దులిపేద్దాం

**మొదటి పేజీ తరువాయి**

సేకరించిన ఈ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పులు తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టవచ్చని అభిజీత్ దీప్కే తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగంలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంపొందించడమే ధ్యేయంగా సీజేపీ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

### సెప్టెంబర్ 5న భారీ నిరసన

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరోసారి ఆందోళన బాట పట్టాలని నిర్ణయించింది. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నీట్ పరీక్షల నేపథ్యంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలు, పోలీసుల వేధింపులకు గురైన బాధితులతో కలిసి ఈ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ నిరసన ర్యాలీ సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుండి ఢిల్లీలోని నూతన పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు కొనసాగనుంది. జూలై 25న ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని తాము దేశవ్యాప్త నిరసనలను విరమించుకున్నామని, అయితే ఇప్పుడు ప్రభుత్వం మాట తప్పిందని సీజేపీ ఆరోపించింది. ఇది యువతను, బాధితుల కుటుంబాలను వంచించడమేనని పార్టీ తన ప్రకటనలో పేర్కొంది. తమ సహనాన్ని బలహీనతగా భావించవద్దని, ప్రభుత్వ వైఖరి కారణంగానే తాము మళ్లీ రోడ్డెక్కాల్సి వస్తోందని హెచ్చరించింది.

# కొండా తప్పుకో!

**మొదటి పేజీ తరువాయి**

ఫోన్ చేసి, గౌరవ ప్రదంగా తప్పుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిసింది. ఒకట్రెండు రోజులు సమయం తీసుకొని, రాజీనామా సమర్పించాలని సురేఖకు సదరు మంత్రి సలహా ఇచ్చినట్టు సమాచారం. ఇక, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బలమైన నేపథ్యం కలిగిన కొండా సురేఖకు ఈ దఫా ఏ ఎమ్మెల్యే నుంచి కూడా మద్దతు లభించలేదు. కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చాయన్న భావనలో అధిష్టానం ఉండడంతో ఎవ్వరూ..సురేఖకు మద్దతు ఇవ్వడానికి ముందుకు రాలేదు. ఆదివారం సురేఖ.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ను కలిసి అనేక అంశాలపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినా.. భేటీలో ఆమెకు అనుకూల హామీ రాలేదని సమాచారం.

## సురేఖకు తెలీకుండానే డిప్యూటేషన్లు రద్దు

తెలంగాణ అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు ఊహించని షాక్ తగిలింది. మంత్రికి ముందస్తు సమాచారం లేకుండా, ఆమెకు తెలియకుండానే అటవీశాఖలో పలువురు అధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్ కుమార్ సంచలన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.. ముగ్గురు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల డిప్యూటేషన్లను రద్దు చేశారు. డిప్యూటేషన్ రద్దయిన అధికారులు వెంటనే హెడ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని పీసీసీఎఫ్ ఆదేశాలు జారీ చేశారు. ముందస్తు సమాచారం, అనుమతి లేకుండా నేరుగా మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నందుకే సదరు అధికారులపై ఈ విధమైన చర్యలు తీసుకున్నట్లు అటవీశాఖ వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది. తమ డిప్యూటేషన్ల రద్దు వ్యవహారంపై ఎఫ్ఆర్ఓ సంఘం ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై వారు వెంటనే మంత్రి కొండా సురేఖను కలిసి ఫిర్యాదు చేశారు. మంత్రికి కనీస సమాచారం ఇవ్వకుండానే పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను కూడా రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం ఇప్పుడు అటవీశాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. మంత్రి ఆదేశాలను అధిగమించి ఉన్నతాధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై రాజకీయ, అటవీశాఖ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# చెక్కులివ్వడానికి ఎమ్మెల్యేలెవరు?

**మొదటి పేజీ తరువాయి**

కోర్టు ప్రస్తావించింది. నిజంగా అవసరం ఉన్నవారికి ప్రభుత్వ సాయం అందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇక ఆగస్టు 20వ తేదీన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు విచారణ సందర్భంగా నిధుల విడుదల అంశానికి సంబంధించి స్టేను ఎత్తివేయడానికి నిరాకరించింది. నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలంటూ ప్రభుత్వం చేసిన అభ్యర్థనను తోసిపుచ్చిన న్యాయస్థానం, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఈ పథకాలకు సంబంధించి చెక్కులను ఎమ్మెల్యేలు ఇవ్వడాన్ని ప్రధానంగా తప్పుబట్టిన న్యాయస్థానం.. అది రాజకీయ జోక్యమే అవుతుందని హెచ్చరించింది.

# నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**మొదటి పేజీ తరువాయి**

ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# 2029లోనే జమిలి!

**మొదటి పేజీ తరువాయి**

వివిధ వర్గాల నుంచి ఈ ప్రతిపాదనకు అనూహ్యమైన మద్దతు లభిస్తోందని పి.పి. చౌదరి తెలిపారు. కమిటీ సంప్రదించిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, నిపుణులు, ఇతర భాగస్వామ్య వర్గాల్లో దాదాపు 99 శాతం మంది జమిలి ఎన్నికల ఆలోచనకు సానుకూలంగా స్పందించారని ఆయన వెల్లడించారు. ఈ బలమైన మద్దతే 2029 నాటికి దీనిని అమలు చేయాలనే ఆలోచనకు బలం చేకూరుస్తోందని కమిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల జరిగిన జేపీసీ సమావేశానికి కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు సాగరికా ఘోష్ వంటి ప్రతిపక్ష సభ్యులు హాజరయ్యారు. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలు, దానివల్ల ఎదురయ్యే సవాళ్లపై వారు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను కమిటీ ముందుంచారు. అయితే, జమిలి ఎన్నికల అమలు అంత సులభం కాదు. దీనికోసం రాజ్యాంగంలోని పలు అధికరణలను సవరించాల్సి ఉంటుంది. పార్లమెంట్ ఉభయ సభలతో పాటు, కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం కూడా అవసరం. ప్రస్తుతం వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలాన్ని కొన్నింటికి తగ్గించడం, మరికొన్నింటికి పెంచడం వంటి క్లిష్టమైన ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. ఈ విధానం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని, ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యతను తగ్గిస్తుందని పలు ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయినప్పటికీ, ప్రభుత్వం ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తుండటంతో రాజకీయ వర్గాల్లో చర్చ తీవ్రతరమైంది.

# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి**

క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండి అని సీఎం సూచించారు. ఈ సమావేశానికి హాజరైన వారిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్‌లు ఆది శ్రీనివాస్,రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, వీర్లపల్లి శంకర్, ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగమాయి, మందుల సామేల్, వేడ్మా బొజ్జు, కోరం కనకయ్య, లక్ష్మి కాంతరావు, రామ్ దాస్ నాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఉన్నారు.



# కృష్ణా జలాలపై నిర్ణయం తీసుకోలే!

## ఇరు రాష్ట్రాల నీటి అవసరాలపై మాత్రమే చర్చ.. జలసౌధలో కృష్ణానదీ బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): హైదరాబాద్ జలసౌధలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భేటీకి తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు, ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి హాజరయ్యారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చలు జరిపారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చారు. తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని ఖరారు చేశారు. తర్వాత 17కు వాయిదా పడింది. ఆ సమయంలో ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. దీంతో సోమవారం ఈ భేటీని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు. తాగునీటి కోసం చెరి సగం వాడుకోవాలని తెలంగాణ సమావేశంలో ప్రస్తావించింది. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్ 4కు మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. సాగర్, శ్రీశైలం నీటి వాటాలపై చర్చించామని తెలంగాణ ఈఎన్సీ రఘువర్ధన్ తెలిపారు. ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే వాడుకోవాలని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుందని అన్నారు. తాగునీటికి 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పామని, పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీరు వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఎల్ నినో పరిస్థితుల్లో తాగునీటి కోసమే ఉపయోగించుకోవాలని సూత్రప్రాయ నిర్ణయం జరిగిందని ఏపీ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని, సెప్టెంబర్ నాలుగో తేదీన మళ్లీ సమావేశమై చర్చిస్తామని పేర్కొన్నారు.

## 22ఏ, హౌసింగ్ బోర్డు స్థలాలపై 26న సమావేశం

కూకట్‌పల్లి, ఆగస్టు 24 (ఈవార్తలు): కూకట్‌పల్లి మండలంలోని పలు కాలనీలను 22ఏ జాబితాలో చేర్చి నిషేధిత భూములుగా మార్చడం, హౌసింగ్ బోర్డు స్థలాల విక్రయానికి సంబంధించిన సమస్యలపై ఈ నెల 26న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. వసంత్‌నగర్ డివిజన్‌లోని ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు సమావేశం జరగనుంది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, లోక్‌సత్తా పార్టీ అధినేత, మాజీ ఎమ్మెల్యే జయప్రకాశ్ నారాయణ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, వసంత్‌నగర్, బాలాజీనగర్, కైత్లాపూర్, మూసాపేట్ ప్రాంతాల్లోని 22ఏ బాధిత కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు, యువత, మహిళలు సమావేశానికి హాజరై సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## హేమదుర్గా మాత ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

కూకట్‌పల్లి, ఆగస్టు 24 (ఈవార్తలు): మియాపూర్‌లోని శ్రీ శ్రీ శ్రీ హేమదుర్గా మాత ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మంగళవారం నిర్వహించే ప్రత్యేక పూజల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. అనంతరం బండి రమేష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని ఆహ్వానించారు.

## అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

**ఐదు చోరీ కేసులు ఛేదించిన పోలీసులు**

జగిత్యాల టౌన్, ఆగస్టు 24 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ఐదు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసుల్లో నిందితుడిగా ఉన్న అంతర్జిల్లా దొంగను జగిత్యాల టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి బర్కత్‌పురకు చెందిన షేక్ సలీం ఏ ఉస్మాన్ (55)ను జగిత్యాల విద్యానగర్ బైపాస్ రోడ్డుపై టౌన్ ఎస్ఐ ఎం. సుప్రియ తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో నిందితుడిని విచారించగా, జగిత్యాల పట్టణ పరిధిలో జరిగిన పలు దొంగతనాలకు తానే పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 23 గ్రాముల బంగారు నగలు, 50 గ్రాముల వెండి, మువ్వల హారం, ఒక ల్యాప్‌టాప్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ తెలిపారు. కేసుల ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ ఎం. సుప్రియ, ఐడి పార్టీ జీవన్, ఐడి పార్టీ చందు, కానిస్టేబుల్ విజయ్, పోలీస్ సిబ్బందిని డి.ఎస్.పి. పురుషోత్తం రెడ్డి, మరియు. ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ అభినందించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**రూ.1.63 లక్షల నగదు, పేకముక్కలు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

కోరుట్ల, ఆగస్టు 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల గుమ్లాపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై కోరుట్ల పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ జి. శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,63,100 నగదు, 52 పేకముక్కలు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు: మమత

కోల్‌కతా: తాను రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీని అధికార పీఠం నుంచి దించే వరకు తన పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. సోమవారం ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నాలుగు నెలల్లోనే బీజేపీ అసలు స్వరూపం ప్రజలకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఎన్ఆర్సీ అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జనగణనను ఒక సాకుగా వాడుకుంటోందని ఆరోపించారు. జనగణన దరఖాస్తులపై సంతకాలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# జనసేన గూటికి కొండా సుస్మిత?



వరంగల్, ఆగస్టు 24 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర ప్రచారం ఒకటి ఊపందుకుంది. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత త్వరలో జనసేన పార్టీలో చేరబోతున్నారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత వివాదాల నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారని, జనసేన నేతలతో చర్చలు కూడా జరుగుతున్నాయని రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో కొండా ఫ్యామిలీకి, కాంగ్రెస్ అధిష్ఠానానికి మధ్య దూరం పెరిగిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పరకాల అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న సుస్మిత, తనకు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. అంతేకాకుండా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆమె పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇలాంటి తరుణంలోనే సుస్మిత జనసేన వైపు చూస్తున్నారని, ఆ పార్టీ నేతలతో మంతనాలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో పార్టీని విస్తరించే పనిలో ఉన్న జనసేన, ఆమె చేరికకు సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం ఆ పార్టీ విస్తరణ వ్యూహాలకు బలం చేకూరుస్తోంది. అయితే, ఈ ప్రచారంపై కొండా సుస్మిత వైపు నుంచి గానీ, జనసేన పార్టీ నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాంగ్రెస్‌లో అంతర్గత వివాదం ముదురుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ ప్రచారం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని రేపుతోంది.

# భర్తను చంపి, పొట్ట చీల్చిన భార్య

**హర్యానాలోని కురుక్షేత్రలో దారుణ ఘటన**

కురుక్షేత్ర: హర్యానాలోని కురుక్షేత్రలో అత్యంత దారుణమైన, ఒళ్లు గగుర్పొడిచే ఘటన వెలుగులోకి వచ్చింది. భర్తను కిరాతకంగా హత్య చేసిన ఓ మహిళ, అతని శరీరాన్ని ఛిద్రం చేసింది. ఈ క్రమంలో ఇంటి యజమానికి అడ్డంగా దొరికిపోవడంతో భయంతో టెర్రస్‌పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, పీహోవా రోడ్డులోని రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేశ్, విమలా దేవి దంపతులు ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజేశ్ స్థానికంగా ఓ వాటర్ ట్రేడింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో వీరిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వారి ఇంట్లోంచి పెద్దగా అరుపులు వినిపించడంతో ఇంటి యజమాని రింకూ వారిని చూసేందుకు టెర్రస్‌పైకి వెళ్లాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి రింకూ షాక్‌కు గురయ్యాడు. రాజేశ్ రక్తపు మడుగులో పడి ఉండగా, అతని పొట్ట భాగం చీల్చి ఉంది. బయటకు వచ్చిన పేగులను విమల ఓ సంచిలో పెడుతుండటం అతను గమనించాడు. ఇంతలో తనను ఇంటి యజమాని చూశాడని గ్రహించిన విమల, కంగారుతో టెర్రస్‌పై నుంచి కిందికి దూకేసింది. గాయపడిన ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు.

## కెనడా దిగుమతులపై 50 శాతం సుంకాలు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా, కెనడా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. కెనడా నుంచి దిగుమతి అయ్యే కార్లు, ట్రక్కులు, వాహన విడిభాగాలు, ఉక్కుపై ఏకంగా 50 శాతం మేర సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ కొత్త టారిఫ్‌లు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. తమ దేశ వ్యవసాయ ఉత్పత్తులపై కెనడా అధిక సుంకాలను విధిస్తోందని, దీనివల్ల అమెరికా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ట్రంప్ ఆరోపించారు. కెనడా వైఖరి కారణంగానే తమకు 60 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. ఇకపై కెనడాను ప్రత్యేక దేశంగా పరిగణించబోమని, వాణిజ్య వ్యవహారాల్లో ఆ దేశంతో కలిసి ముందుకు సాగడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. కెనడా వాణిజ్యంలో 95 శాతం వాటా అమెరికాతోనే ముడిపడి ఉందని, తమతోనే ఆ దేశానికి అత్యధిక అవసరం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికాలో తయారైన వస్తువులకు మాత్రం ఈ సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని ఆయన వెల్లడించారు.

## బలూచ్ వేర్పాటువాదులతో పాక్ చర్చలు

సైనిక చర్యలు విఫలం కావడంతోనే చర్చల ప్రతిపాదన

ఇస్లామాబాద్: బలూచిస్థాన్‌లో దశాబ్దాలుగా అనుసరిస్తున్న సైనిక అణచివేత ఫలించకపోవడంతో, పాకిస్థాన్ ప్రభుత్వం చివరికి ఇప్పుడు చర్చల మార్గాన్ని ఎంచుకుంది. ప్రావిన్స్‌లో తీవ్రమవుతున్న హింస, రాజకీయ, ఆర్థిక అసంతృప్తిని బలంతో అణచివేయలేమని గ్రహించిన షెహబాజ్ షరీఫ్ సర్కార్.. బలోచ్ వేర్పాటువాదులతో చర్చలకు సిద్ధమని ప్రకటించింది. రాజకీయంగా బలూచిస్థాన్‌కు జాతీయ స్థాయిలో సరైన ప్రాతినిధ్యం లేదు. ఇస్లామాబాద్ తమపై విధానాలను రుద్దుతోందని, వలస తరహా పాలన సాగిస్తోందని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చర్చల ప్రతిపాదన తీసుకురావడం ఒక ముందడుగే అయినా, దాని చిత్తశుద్ధిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు... ప్రభుత్వంలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయని సూచిస్తున్నాయి. అణచివేత విఫలమైందని అంగీకరించి, చర్చలకు పిలుపునిచ్చిన పాక్ ప్రభుత్వం.. గౌరవానికి సంబంధించిన రాజకీయ సమస్యగా గుర్తిస్తేనే శాంతి స్థాపన సాధ్యమవుతుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## ఏటా 3 సిలిండర్లు

**విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు**

చెన్నై: తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు.

## కొండా సురేఖ చేరికపై పార్టీదే నిర్ణయం: డీకే అరుణ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ భవిష్యత్‌పై చర్చ జరుగుతున్న వేళ, ఆమె బీజేపీలో చేరతారన్న ఊహాగానాలపై ఎంపీ డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను పార్టీలోకి తీసుకోవాలా? వద్దా? అనేది బీజేపీ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన డీకే అరుణ పలు అంశాలపై స్పందించారు. ఈసారి మహబూబ్‌నగర్ స్థానికులకే ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అన్ని ఎన్నికల్లో పనిచేసిన పవన్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పార్టీని కోరినట్లు చెప్పారు. బీజేపీ జాతీయ నూతన కమిటీపై స్పందిస్తూ, ఒక బాధ్యత నుంచి తొలగిస్తే అంతకంటే మంచి బాధ్యత ఇస్తారేమోనని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ మంత్రి అయిన తర్వాత పార్టీ బాధ్యతలు ఉండవని, తాను ఎంపీ అయిన తర్వాత సమయం లేక కర్ణాటక ఇన్‌ఛార్జి బాధ్యతలను వదిలేశానని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలందరూ ఐక్యంగానే ఉన్నారని ఎవరిని గద్దె దించి ఎవరిని నియమిస్తారో చూడాలని వ్యాఖ్యానించారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు **94404 55811** నంబర్‌ను సంప్రదించవచ్చు.

## కుంభమేళా బడ్జెట్‌లో 0.1%తో స్కూళ్లకు పునర్జన్మ

**సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాళే**

ముంబై: మహారాష్ట్రలోని ధూలే జిల్లాలో జరిగిన ఒక పాఠశాల వేడుకలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి. వరాళే ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు భారీ ప్రాజెక్టులపై వెచ్చించే నిధులలో అత్యంత స్వల్ప భాగం కేటాయిస్తేనే రాష్ట్రంలో మూతపడుతున్న ఎన్నో పాఠశాలలను రక్షించవచ్చని ఆయన హితవు పలికారు. మహారాష్ట్ర ప్రభుత్వం నాసిక్-సింహస్థ (కుంభ్) మేళా కోసం అత్యంత భారీ మొత్తంలో నిధులు కేటాయిస్తోందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమం కోసం ఏకంగా రూ.32వేల కోట్ల నుంచి రూ.34వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు ప్రస్తావించారని తెలిపారు. అలాగే మరో కారిడార్ ప్రాజెక్ట్ నిమిత్తం రూ.11వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసిన ఆయన.. ఈ భారీ కేటాయింపులలో కేవలం 0.1 శాతం (సుమారు రూ. 32 కోట్లు) విద్యా రంగానికి వెచ్చించినా, రాష్ట్రవ్యాప్తంగా మూతపడే దశలో ఉన్న 100 నుంచి 125 మరాఠీ మీడియం పాఠశాలలను సులభంగా కాపాడగలిగేవాళ్లమని గణాంకాలతో సహా వివరించారు.

## ఈవీఎంలకు ఇంటర్నెట్, బ్లూటూత్ ఉండదు: సీఈసీ

లక్నో: భారత ఈవీఎంలు పూర్తిగా సురక్షితమైనవని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. వాటికి ఇంటర్నెట్, బ్లూటూత్, వైఫై వంటి వైర్‌లెస్ కనెక్టివిటీ సదుపాయాలు ఏవీ ఉండవని స్పష్టం చేశారు. లక్నోలోని చారిత్రాత్మక కాల్విన్ తాలుక్దార్స్ కళాశాలలో విద్యార్థులతో సీఈసీ ముచ్చటించారు. ఈ సందర్భంగా భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల విశ్వసనీయత, యువ ఓటర్ల ప్రాముఖ్యత వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో ఉపయోగించే ఈవీఎంలు ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని చెప్పారు. వీటికి ఎలాంటి వైర్‌లెస్ లేదా ఇంటర్నెట్ టెక్నాలజీతో అనుసంధానం ఉండదని స్పష్టం చేశారు. వీటిని హ్యాక్ చేసే అవకాశమే లేదని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఇంతటి బృహత్తర ప్రక్రియను సజావుగా నిర్వహించడానికి ఎంతో మంది సిబ్బంది శ్రమిస్తున్నారని వివరించారు.

## ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ల పెళ్లి

ముంబై: ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఒకరినొకరు ఇష్టపడ్డారు. అక్కడితో ఆగకుండా.. వివాహ బంధంతో ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 30న పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఉన్నతాధికారులకు సెలవు దరఖాస్తు చేసుకోవడం పింప్రి-చించ్‌వాడ్ పోలీసు కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఓ కానిస్టేబుల్ కుటుంబం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. 2018లో ప్రత్యేక పింప్రి-చించ్‌వాడ్ పోలీసు కమిషనరేట్ ఏర్పాటైన తర్వాత వీరిద్దరూ పోలీసు శాఖలో చేరారు. గత మూడేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న వీరిద్దరూ కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. సెలవు దరఖాస్తులతో పాటు ముద్రించిన వివాహ ఆహ్వాన పత్రికను కూడా జతచేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది

# జీఓ 97ను రద్దు చేయాలి

## విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్

జగిత్యాల, ఆగస్టు 24 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. సోమవారం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన విద్యా అవకాశాలను ప్రస్తుత ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో 1,023 గురుకులాలను ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించామని తెలిపారు. ప్రస్తుతం గురుకులాల్లో సరైన వసతులు, భోజనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వివిధ కారణాలతో విద్యార్థుల మృతులు చోటుచేసుకున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గురుకుల వ్యవస్థను బలోపేతం చేయకుండా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' పేరుతో కొత్త విధానాలు తీసుకురావడం సరికాదన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గతంలో పెద్దఎత్తున ప్రయోజనం కల్పించామని ఈశ్వర్ పేర్కొన్నారు. పాఠశాలలకు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోయాయని, ప్రభుత్వం వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 97తో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు నష్టం కలుగుతుందని, పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ, స్కిల్ యూనివర్సిటీతో కలపడం



సరికాదని, జీఓ 97ను వెంటనే రద్దు చేసి పాలిటెక్నిక్ వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి, పాలిటెక్నిక్ వ్యవస్థను బలోపేతం చేశామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల నిరుపేదలు, కూలీలు, సామాన్య వర్గాల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పరిస్థితులపై ప్రజలు, మేధావులు, విద్యావంతులు ఆలోచించాలని కోరారు. సమావేశంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పొక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 24 (ఈవార్తలు): సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పొక్సో కేసులో నిందితుడు జంగ్లి రఘుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పొక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ సోమవారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్లలోని ఓ డ్యాన్స్ అకాడమీలో మైనర్ బాలికల పట్ల నిందితుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు రావడంతో అప్పటి సీఐ ఉపేందర్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం దర్యాప్తు పూర్తిచేసి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో ప్రాసిక్యూషన్ ఎనిమిది మంది సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జాన్సీ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పనిచేస్తే నిందితులకు శిక్షలు పడేలా చేయవచ్చని తెలిపారు. కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌లో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్పీ అభినందించారు.



## భీమన్న ఆలయంలో విస్తృత తనిఖీలు

వేములవాడ అర్బన్, ఆగస్టు 24 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో రమాదేవి, డీఈవో నవీన్‌కుమార్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, డొనేషన్ కౌంటర్లను పరిశీలించిన అధికారులు భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కోడె మొక్కుల ప్రాంగణంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోడె కట్టే భక్తులు బయటకు వెళ్లే ఎగ్జిట్ గేటు నుంచి ఇతరులను లోపలికి అనుమతించవద్దని హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బందికి సూచించారు. భక్తుల నుంచి సిబ్బంది లేదా ఇతరులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఎస్పీఎఫ్ సిబ్బంది, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి

గ్రామస్థుల వినతిపై బండి సంజయ్ సానుకూల స్పందన

కరీంనగర్/గంగాధర, ఆగస్టు 24 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించి ఎత్తివేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి బండి సంజయ్ కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. గ్రామస్థులపై నమోదైన కేసులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వెల్లడించారు. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించే అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి గ్రామస్థులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

## ధర్మపురిలో 5,407 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు: అడ్లూరి**

ధర్మపురి, ఆగస్టు 24 (ఈవార్తలు): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలోని 8 రేషన్ షాపుల పరిధిలో మొత్తం 5,407 నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం సంక్షేమ పథకాలకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులతో పాటు వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆహార, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## కొడిమ్యాల పీఎస్‌లో ఎస్పీ తనిఖీలు

కొడిమ్యాల, ఆగస్టు 24 (ఈవార్తలు): నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పోలీసులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, దర్యాప్తు విధానం, నేరాల నియంత్రణ చర్యలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి, నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్-112కు వచ్చే ప్రతి కాల్‌పై వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి వేగంగా చేరుకోవాలని ఎస్పీ సూచించారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ నేరాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణకు కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని అన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ రాజ్‌కుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఒకే కుటుంబంలో నలుగురు మృతి

### సిరిసిల్ల జిల్లాలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్, ఆగస్టు 24 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను సోమవారం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితేతో కలిసి ఆది శ్రీనివాస్ పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వివాహ వేడుకకు వెళ్తున్న రుద్రంగి మండల కేంద్రానికి చెందిన షాదుల్లా కుటుంబం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో షాదుల్లా, ఆయన భార్య



హసీనా, మరో హసీనా, పదో తరగతి చదువుతున్న బాలిక మృతి చెందారు. ప్రమాదం అనంతరం క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు ముందు, వెనుక సీట్లలో సీట్‌బెల్ట్ ధరించాలని కోరారు. అతివేగాన్ని నివారించాలని సూచించారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటి నుంచి బయలుదేరిన ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకుని సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని కోరారు. ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. ప్రమాదానికి గల కారణాలపై సంబంధిత అధికారులతో సమీక్షించి పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు. అతివేగం కారణంగా వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.




## ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు

**తెలంగాణ జానపద కళలకు ప్రపంచ గుర్తింపు: వంగ శ్రీనివాస్‌గౌడ్**

వేములవాడ అర్బన్, ఆగస్టు 24 (ఈవార్తలు): ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో వేములవాడలో సోమవారం జానపద సంబరాలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తరఫున నిర్వహించిన ఈ కార్యక్రమానికి 500 మందికిపైగా కళాకారులు హాజరయ్యారు. మహిళా డప్పులు, యక్షగానం, ఒగ్గుకథ, ఒగ్గుడోలు, వీధి భాగవతం, భజన, కోలాటం, చిరుతల భజన తదితర కళారూపాలను కళాకారులు ప్రదర్శించారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా ప్రభుత్వ సహకారంతో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు జానపద కళలు ప్రతీకలని, వాటి పరిరక్షణకు కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కళాకారులకు ప్రభుత్వ సహకారం మరింతగా అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రొండా రాజా, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వందేకోటి కవిత, జిల్లా అధ్యక్షుడు తీగల రాజేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవితేజ, కార్యనిర్వాహక కార్యదర్శి తీగల శ్రీనివాస్‌గౌడ్, కళాకారులు పాల్గొన్నారు.

## గ్రానైట్ లారీల ఓవర్‌లోడ్‌పై చర్యలు తీసుకోవాలి

కొడిమ్యాల, ఆగస్టు 24 (ఈవార్తలు): కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల మీదుగా గ్రానైట్ టిప్పర్ లారీల్లో అధిక లోడుతో రవాణా జరుగుతుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి తెలిపారు. ఓవర్‌లోడ్ లారీల రాకపోకలను అరికట్టాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో గ్రానైట్ టిప్పర్ లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయని అన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఓవర్‌లోడ్ వాహనాల కారణంగా ప్రమాదాల ముప్పు కూడా ఉందన్నారు. అధికారులు వెంటనే టిప్పర్ లారీలను తనిఖీ చేసి, ఓవర్‌లోడ్ రవాణాను అరికట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వాహన యజమానులు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు రేకులపెల్లి తిరుపతిరెడ్డి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి బండి అనిల్ యాదవ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

**ప్రజావాణిలో ఎంపీడీవోకు వీహెచ్‌పీ వినతి**

వేములవాడ అర్బన్, ఆగస్టు 24 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని సర్వే నంబర్లు 1389, 1390, 1391లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి,



ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలాలను పరిరక్షించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకులు సోమవారం మండల స్థాయి ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. సదరు సర్వే నంబర్లలో ఇప్పటికే మసీదు నిర్మాణం జరిగిందని, లేఅవుట్‌లో ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలంలో షాదీఖానా నిర్మాణం జరుగుతోందని వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, భూమి వినియోగం, లేఅవుట్ రికార్డులను రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని ఓపెన్ జిమ్, పార్కు, గ్రంథాలయం వంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై గతంలో మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించిన వినతిపత్రాల ప్రతులను కూడా అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు పల్లె శ్యామ్‌సుందర్‌రెడ్డి, కార్యదర్శి గుండు జి.గోపాల్, జిల్లా కార్యదర్శి గడప కిషోర్‌రావు, తిప్పర్తి సాయికృష్ణ పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌పై చర్యలేవి?

**గుట్టలు మాయమైతున్నయ్**

**అధికారులు ఏమి చేస్తున్నారు?.. సీఎంకు జీవన్‌రెడ్డి లేఖ**

జగిత్యాల, ఆగస్టు 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ భూములు, గుట్టల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను అరికట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. జగిత్యాల సమీపంలోని నర్సింగాపూర్, తాటిపల్లి, మోరపల్లి, జాబితాపూర్, తిమ్మాపూర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ గుట్టల్లో



అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు తవ్వకాలతో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. మల్యాల మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అక్రమ మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలో పడి మృతి చెందిన ఘటనను జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. తిమ్మాపూర్ రెవెన్యూ గ్రామంలోని ముప్పాల చెరువు శిఖం ప్రాంతంలో మట్టిని అక్రమంగా తరలించడం వల్ల చెరువు విస్తీర్ణం తగ్గడంతో పాటు మత్స్యకారులు, భూగర్భ జలాలపై ప్రభావం పడుతోందన్నారు. ఎస్సారెస్పీ వరద కాలువ తవ్వకాల సమయంలో పేరుకుపోయిన మట్టి భారీగా అందుబాటులో ఉందని, అవసరమైతే నిబంధనల ప్రకారం ఆ మట్టిని వినియోగించుకోవచ్చని తెలిపారు. గత కొన్నేళ్లుగా అక్రమ మైనింగ్‌తో ప్రకృతి వనరులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపించారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు అక్రమ తవ్వకాలను అడ్డుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. జిల్లా ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అక్రమ మైనింగ్‌ను తక్షణమే అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని జీవన్‌రెడ్డి కోరారు. ఇదే అంశంపై ప్రజావాణిలోనూ వినతిపత్రం అందజేశారు.

## కోటిలింగాలలో భోగ శ్రావణి ప్రత్యేక పూజలు

జగిత్యాల, ఆగస్టు 24 (ఈవార్తలు): బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణిప్రవీణ్ జన్మదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారి ఆశీస్సులు పొందారు.





ఆగస్టు 25, 2016.. భారత ఆర్థిక చరిత్రలో ఆ రోజు ఒక సాధారణ సాంకేతిక ఆవిష్కరణగా కనిపించి ఉండవచ్చు. కానీ పదేళ్లలోనే అది భారతీయుల డబ్బు చెల్లించే విధానాన్ని పూర్తిగా మార్చేసింది. జేబులో నగదు, పర్సులో కార్డులు, బ్యాంకులో చెక్కులు, ఏటీఎంల వద్ద క్యూలు, నెట్‌బ్యాంకింగ్‌లో సంక్లిష్టమైన వివరాలు.. ఈ పాత వ్యవస్థలన్నింటినీ ఒకే మొబైల్ ఫోన్‌లోకి తీసుకొచ్చిన విప్లవమే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ).

ఒకప్పుడు నెట్‌బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు ప్రధానంగా బ్యాంకు ఖాతాదారులు, వ్యాపారులు, పట్టణ మధ్యతరగతి, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారికే పరిమితమయ్యేవి. కానీ నేడు టీ బండి, కూరగాయల వ్యాపారి, ఆటో డ్రైవర్, వీధి వ్యాపారి, చిన్న కిరాణా దుకాణం నుంచి ఐదు నక్షత్రాల హోటల్ వరకు ఒకే మాట వినిపిస్తోంది..“యూపీఐ ఉందా?” అదే యూపీఐ విప్లవం.

- (ఈవార్తలు ప్రత్యేక కథనం)

## వచ్చే పదేళ్లు ఎలా..?

యూపీఐ మొదటి పదేళ్లు భారతదేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రజాస్వామ్యీకరించిన కాలంగా నిలిస్తే, తదుపరి పదేళ్లు అంతర్జాతీయ విస్తరణ, సాంకేతిక ఆవిష్కరణలు, మరింత ఆర్థిక సమ్మిళితత్వం దిశగా సాగనున్నాయి. దేశీయంగా మరిన్ని చిన్న వ్యాపారులను డిజిటల్ చెల్లింపుల పరిధిలోకి తీసుకురావాలి. సరిహద్దులు దాటి మరిన్ని దేశాలతో యూపీఐ అనుసంధానం పెరగాలి. డిజిటల్ మోసాలను అరికట్టడానికి అధునాతన భద్రతా వ్యవస్థలు అవసరం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోమెట్రిక్ సెక్యూరిటీ, ఆధునిక ఫ్రాడ్ డిటెక్షన్ వ్యవస్థలు తదుపరి దశలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. యూపీఐ పదేళ్ల కథ కేవలం ఒక సాంకేతిక వ్యవస్థ విజయగాథ కాదు. ఇది భారతీయ ఆర్థిక ప్రజాస్వామ్యీకరణ కథ. ఒకప్పుడు డిజిటల్ బ్యాంకింగ్ ధనవంతులు, పెద్ద వ్యాపారాలు, పట్టణ వర్గాలకు మాత్రమే సులభంగా అందుబాటులో ఉండేది. నేడు అదే సాంకేతికత కూరగాయలు అమ్ముకునే మహిళ చేతిలోని క్యూఆర్ కోడ్‌గా మారింది. రూ.10 చాయ్ నుంచి కోట్ల రూపాయల లావాదేవీ వరకు ఒకే డిజిటల్ వేదిక పనిచేయడం యూపీఐ ప్రత్యేకత.

# బ్యాంకుల్లో క్యూ.. క్యూఆర్ కోడ్ వరకు!

## చిల్లర నుంచి సరికొత్త చరిత్రకు భారతం.. పదేళ్లలో యూపీఐ అఖండ విజయం

## 90 వేల లావాదేవీలతో మొదలై.. రోజుకు 66 కోట్ల చెల్లింపుల స్థాయికి చేరిక

2026 ఆగస్టు 25తో యూపీఐ విజయవంతంగా పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ దశాబ్దంలో భారత్ కేవలం డిజిటల్ చెల్లింపుల దేశంగా మారలేదు; ప్రపంచంలోనే అత్యంత పెద్ద రియల్‌టైమ్ చెల్లింపుల వ్యవస్థను నిర్మించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి గుర్తించిన ప్రకారం, ప్రపంచ రియల్‌టైమ్ చెల్లింపుల పరిమాణంలో భారత యూపీఐ వాటా 2025 నాటికి సుమారు 49 శాతం. అంటే ప్రపంచంలో జరిగే ప్రతి రెండు తక్షణ డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు ఒకటి భారతదేశం నుంచే జరుగుతోందన్న మాట.

యూపీఐకి ముందు డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఉన్నప్పటికీ అవి సాధారణ ప్రజల జీవితంలో అంతగా కలిసిపోలేదు. నెట్‌బ్యాంకింగ్ ద్వారా డబ్బు పంపాలంటే ఖాతా సంఖ్య, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, లబ్ధిదారుడి వివరాలు నమోదు చేయాల్సి వచ్చేది. కొన్నిసార్లు లబ్ధిదారుడిని ముందుగా నమోదు చేసి నిర్దిష్ట సమయం వేచి చూడాల్సి వచ్చేది. మొబైల్ వాలెట్లు కూడా వచ్చాయి. కానీ ఒక సంస్థ వాలెట్‌లో ఉన్న డబ్బును మరో వాలెట్‌కు పంపడంలో పరిమితులు ఉండేవి. వేర్వేరు బ్యాంకులు, వేర్వేరు యాప్‌లు, వేర్వేరు చెల్లింపు పద్ధతులు.. సాధారణ వినియోగదారుడికి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ ఇంకా సంక్లిష్టంగానే ఉండేది.

ఈ పరిస్థితిని మార్చడానికి భారతీయ రిజర్వ్ బ్యాంకు పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసిన వ్యవస్థే యూపీఐ. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన ఈ వేదిక వివిధ బ్యాంకు ఖాతాలను పరస్పరం అనుసంధానించి, ఒకే మొబైల్ ఆధారిత వ్యవస్థ ద్వారా తక్షణ డబ్బు బదిలీకి అవకాశం కల్పించింది. యూపీఐ విజయానికి ప్రధాన కారణం దాని సరళత. బ్యాంకు ఖాతా నంబర్ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ కోసం వెతకాల్సిన పనిలేదు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు. యూపీఐ ఐడీ నమోదు చేస్తే చాలు. మొబైల్ నంబర్ ద్వారా చెల్లింపు చేయవచ్చు. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే..డబ్బు పంపేవాడు ఏ బ్యాంకులో ఉన్నా, స్వీకరించేవాడు ఏ బ్యాంకులో ఉన్నా పరస్పరం లావాదేవీ జరగగలిగే ఇంటర్‌ఆపరబుల్ వ్యవస్థను యూపీఐ అందించింది. అదే దీని విప్లవాత్మక శక్తి. నెట్‌బ్యాంకింగ్ ఒకప్పుడు ప్రధానంగా పెద్ద మొత్తాల లావాదేవీలకు ఉపయోగపడేది. యూపీఐ మాత్రం రూ.10 చెల్లింపు నుంచి పెద్ద మొత్తాల తక్షణ బదిలీల వరకు డిజిటల్ చెల్లింపులను సామాన్యుడి దైనందిన జీవితంలోకి తీసుకొచ్చింది.



### 90 వేల నుంచి 24,162 కోట్ల వరకు!

యూపీఐ విజయాన్ని అర్థం చేసుకోవాలంటే గణాంకాలే దాని గొప్పదనాన్ని చెబుతాయి. ప్రారంభమైన తొలి నెలలో, అంటే 2016 ఆగస్టులో కేవలం 90 వేల లావాదేవీలు నమోదయ్యాయి. 2016–17 ఆర్థిక సంవత్సరంలో మొత్తం లావాదేవీల సంఖ్య 1.78 కోట్లు మాత్రమే. కానీ 2025–26 ఆర్థిక సంవత్సరం నాటికి యూపీఐ వార్షిక లావాదేవీల సంఖ్య 24,162 కోట్లకు చేరింది. అంటే కేవలం పదేళ్లలో లావాదేవీల పరిమాణం దాదాపు 13 వేల రెట్లు పెరిగింది. లావాదేవీల విలువ కూడా అంతే వేగంగా పెరిగింది. 2016–17లో రూ.0.07 లక్షల కోట్లు ఉండగా, 2025–26లో సుమారు రూ.314 లక్షల కోట్లకు చేరింది. ఇది విలువ పరంగా 4 వేల రెట్లకు పైగా పెరుగుదల. ఇంత భారీ స్థాయిలో ప్రజల జీవితంలోకి ప్రవేశించిన చెల్లింపు వ్యవస్థ ప్రపంచంలో అరుదు. 2025–26లో భారత డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా 84 శాతంగా ఉంది.

### రోజుకు 66 కోట్ల లావాదేవీలు!

పదేళ్ల ప్రయాణంలో యూపీఐ ఇప్పుడు అద్భుతమైన స్థాయికి చేరింది. 2026లో రోజుకు సగటున 66 కోట్ల యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. 2026 మేలో తొలిసారిగా నెలవారీ లావాదేవీలు 2,300 కోట్ల మార్కును దాటాయి. ఆ నెలలో 2,320 కోట్ల లావాదేవీలు జరిగాయి. జూలై 2026లో యూపీఐ తన చరిత్రలోనే కొత్త రికార్డు సృష్టించింది. ఇవి యూపీఐ కేవలం ప్రత్యామ్నాయ చెల్లింపు పద్ధతి కాదని, భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మౌలిక వసతిగా మారిందని స్పష్టం చేస్తున్నాయి. యూపీఐ నిజమైన విజయాన్ని కేవలం కోట్ల లావాదేవీలతో కొలవలేం. చిల్లర కోసం వెతికే భారతదేశాన్ని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే భారతదేశంగా మార్చడమే యూపీఐ అసలైన విప్లవం. ఒకప్పుడు డిజిటల్ చెల్లింపులు పెద్ద దుకాణాలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, విద్యావంతులు, పట్టణ వర్గాలకు పరిమితమయ్యేవి. ఇప్పుడు వీధి పక్కన పండ్లు అమ్మే వ్యక్తి దగ్గర కూడా క్యూఆర్ కోడ్ కనిపిస్తోంది. టీ తాగిన తరువాత రూ.10 చెల్లించడానికి కూడా యూపీఐ. ఆటో ప్రయాణానికి యూపీఐ. పాలవాడికి యూపీఐ. కూరగాయల కొనుగోలుకు యూపీఐ. కరెంటు బిల్లు నుంచి ఇంటి అద్దె వరకు యూపీఐ. దేవాలయ విరాళం నుంచి ఆస్పత్రి బిల్లు వరకు యూపీఐ. ఇది ఆర్థిక వ్యవస్థలో డిజిటలీకరణను కిందిస్థాయి వరకు తీసుకెళ్లింది.

### చిన్న మొత్తాలే యూపీఐ అసలైన శక్తి

2025–26లో జరిగిన యూపీఐ లావాదేవీలను పరిశీలిస్తే ఈ మార్పు మరింత స్పష్టమవుతుంది. వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే పీ2ఎం లావాదేవీలు మొత్తం లావాదేవీల సంఖ్యలో 63 శాతం ఉన్నాయి. వాటిలో 86 శాతం లావాదేవీలు రూ.500లోపే ఉన్నాయి. అంటే యూపీఐ ప్రధానంగా పెద్ద వ్యాపార లావాదేవీల కోసం మాత్రమే కాకుండా రోజువారీ చిన్న చిన్న కొనుగోళ్ల కోసం విస్తృతంగా ఉపయోగపడుతోంది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే పీ2పీ లావాదేవీలు సంఖ్య కంటే విలువలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తం లావాదేవీల విలువలో 71 శాతం పీ2పీ లావాదేవీల వాటా ఉంది. ఈ గణాంకాలు యూపీఐ రెండు ప్రపంచాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని చెబుతున్నాయి..రోజువారీ రూ.10 నుంచి రూ.500 వరకు జరిగే చిల్లర చెల్లింపులు, మరోవైపు పెద్ద వ్యక్తిగత నిధుల బదిలీలు.

### సామాన్యుడి చేతిలోకి బ్యాంకింగ్ వ్యవస్థ

యూపీఐ ప్రారంభ సమయంలో బ్యాంకుల భాగస్వామ్యం పరిమితంగా ఉండేది. 2016–17లో యూపీఐలో పనిచేస్తున్న బ్యాంకుల సంఖ్య 44. 2025–26 నాటికి అది 703 బ్యాంకులకు చేరింది. జూలై 2026 నాటికి యూపీఐలో 741 బ్యాంకులు లైవ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు, చిన్న ఆర్థిక బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు, సహకార బ్యాంకులు..అన్నీ ఈ వ్యవస్థలో భాగమయ్యాయి. అంటే యూపీఐ కేవలం ఒక యాప్ కాదు. భారతదేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తాన్ని పరస్పరం కలిపిన డిజిటల్ రైల్వే ట్రాక్‌లాంటిది. భారతదేశంలో కోట్లాది మందికి బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను అందరూ సమానంగా ఉపయోగించేవారు కాదు. యూపీఐతో బ్యాంకు ఖాతా, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ ఉన్న వ్యక్తి డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో సులభంగా భాగస్వామి కావడం ప్రారంభించాడు. ఇది ముఖ్యంగా చిన్న వ్యాపారులకు గొప్ప మార్పు. ఒక చిన్న దుకాణదారుడు కార్డు స్వైపింగ్ యంత్రం కొనాల్సిన అవసరం లేదు. భారీ చెల్లింపు మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన పని లేదు. ఒక సాధారణ క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ చెల్లింపులు స్వీకరించవచ్చు. ఇదే చిన్న వ్యాపారాన్ని కూడా డిజిటల్ మార్కెట్‌లో భాగస్వామిగా మార్చింది.

### కరోనాతో సరికొత్త మలుపు

కోవిడ్–19 మహమ్మారి సమయంలో భౌతిక నగదు వినియోగంపై ప్రజల్లో జాగ్రత్త పెరిగింది. లాక్‌డౌన్‌లు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, ఇంటి వద్దకు సరుకుల సరఫరా, నగదు రహిత లావాదేవీలు వేగంగా పెరిగాయి. ఈ సమయంలో యూపీఐ వినియోగం మరింత వేగం అందుకుంది. ఆహారం ఆర్డర్ చేయడం నుంచి మందులు కొనుగోలు చేయడం వరకు డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. చిన్న వ్యాపారులు కూడా నగదు లావాదేవీలతో పాటు క్యూఆర్ కోడ్‌ను స్వీకరించారు. కరోనా సంక్షోభం యూపీఐ ప్రాధాన్యాన్ని మరింత పెంచింది. అప్పటి నుంచి అది కేవలం “కొత్త టెక్నాలజీ” కాకుండా భారతీయుల రోజువారీ అలవాటుగా మారిపోయింది. యూపీఐ ఇప్పుడు భారతదేశానికే పరిమితమైన వ్యవస్థ కాదు. 2025 నాటికి ప్రపంచ రియల్‌టైమ్ చెల్లింపుల లావాదేవీ పరిమాణంలో యూపీఐ వాటా సుమారు 49 శాతంగా ఉంది. ఈ స్థాయిని గుర్తిస్తూ అంతర్జాతీయ ద్రవ్య నిధి యూపీఐని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ చెల్లింపు వ్యవస్థగా గుర్తించింది. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు ఉన్నప్పటికీ, ఇంత పెద్ద జనాభా, ఇంత అధిక సంఖ్యలో రోజువారీ చెల్లింపులు, ఇంత విస్తృత బ్యాంకింగ్ అనుసంధానం కలిగిన వ్యవస్థను భారత్ నిర్మించడం విశేషం.



యూపీఐ విజయానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఇది కేవలం పెద్ద కంపెనీల కోసం రూపొందించిన వ్యవస్థ కాదు. సాధారణ వినియోగదారుడి నుంచి చిన్న వ్యాపారి వరకు ఉపయోగించగలిగేలా ఉంది. వేర్వేరు బ్యాంకులు, వేర్వేరు యాప్‌లు, వేర్వేరు సేవల మధ్య కూడా లావాదేవీలు జరిగేలా రూపొందించారు. ప్రపంచంలోని అనేక డిజిటల్ పేమెంట్ వ్యవస్థలు పెద్ద విలువల లావాదేవీలకు ప్రాధాన్యం ఇస్తాయి. యూపీఐ మాత్రం రూ.10 చాయ్ నుంచి పెద్ద మొత్తాల నిధుల బదిలీ వరకు విస్తరించింది. అందుకే యూపీఐ ఒక సాధారణ పేమెంట్ యాప్ కాదు. ఇది భారతదేశం నిర్మించిన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అత్యంత విజయవంతమైన వ్యవస్థల్లో ఒకటి. యూపీఐ భారత ఆర్థిక వ్యవస్థలో అనేక స్థాయిల్లో మార్పు తీసుకొచ్చింది. మొదటిది..నగదుపై ఆధారపడటం తగ్గింది. రెండోది..చిన్న వ్యాపారులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి వచ్చారు. మూడోది..లావాదేవీల వేగం పెరిగింది. నాలుగోది..చెల్లింపు సౌకర్యం సామాన్యుడికి చేరింది. ఐదోది..డిజిటల్ వాణిజ్యం విస్తరించింది. ఆరోది..ప్రభుత్వం, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, వినియోగదారుల మధ్య కొత్త డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. ఇది భారతదేశంలో కొత్త రకం ఆర్థిక అలవాటును సృష్టించింది. ఒకప్పుడు “చిల్లర ఉందా?” అని అడిగిన ప్రజలు ఇప్పుడు “క్యూఆర్ కోడ్ ఉందా?” అని అడుగుతున్నారు. అయితే యూపీఐ విజయం ఎంత గొప్పదైనా, దాని ముందు సవాళ్లు కూడా ఉన్నాయి. డిజిటల్ మోసాలు పెరుగుతున్నాయి. నకిలీ క్యూఆర్ కోడ్లు, ఫిషింగ్ లింకులు, మోసపూరిత యాప్‌లు, ఓటీపీ మోసాలు వంటి సైబర్ నేరాలు వినియోగదారులకు ప్రమాదంగా మారుతున్నాయి. కాబట్టి యూపీఐ తదుపరి దశలో సౌలభ్యంతో పాటు భద్రత కూడా ప్రధాన అంశంగా ఉండాలి. వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, డిజిటల్ పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారికి సైబర్ అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. డిజిటల్ మౌలిక వసతులు బలపడాలి. లావాదేవీలు విఫలమయ్యే పరిస్థితులు తగ్గాలి. సాంకేతిక వ్యవస్థ పెరుగుతున్న లావాదేవీల భారాన్ని సమర్థంగా నిర్వహించాలి.



### యూపీఐ పదేళ్ల ప్రస్థానం:

| | |
|---|---|
| ప్రారంభం: | 25 ఆగస్టు 2016 |
| మొదటి నెల లావాదేవీలు: | 90,000 |
| 2016-17 వార్షిక లావాదేవీలు: | 1.78 కోట్లు |
| 2025-26 వార్షిక లావాదేవీలు: | 24,162 కోట్లు |
| లావాదేవీల పరిమాణం పెరుగుదల: | దాదాపు 13,000 రెట్లు |
| లావాదేవీల విలువ: | రూ.0.07 లక్షల కోట్ల నుంచి రూ.314 లక్షల కోట్లకు |
| విలువ పెరుగుదల: | 4,000 రెట్లకుపైగా |
| 2026లో రోజువారీ సగటు: | 66 కోట్ల లావాదేవీలు |
| జూలై 2026 రికార్డు: | 2,366 కోట్ల లావాదేవీలు |
| జూలై 2026 రికార్డు విలువ: | రూ.29.88 లక్షల కోట్లు |
| యూపీఐలో ఉన్న బ్యాంకులు: | 741 |
| భారత్ డిజిటల్ పేమెంట్లలో వాటా: | 84% |
| ప్రపంచ రియల్‌టైమ్ పేమెంట్లలో వాటా: | 49% |

### యూపీఐ పనిచేస్తున్న 11 దేశాలు

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, భూటాన్, శ్రీలంక, నేపాల్, సింగపూర్, మారిషస్, ఖతర్, కంబోడియా, గ్రీస్, మాల్దీవులు



లవ్లీ చిత్రం



నోరా ఫతేహీ




## 'రంబా ఊర్వశి మేనక' ట్రైలర్ రిలీజ్

కామెడీ సినిమాలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన అల్లరి నరేష్ మరోసారి తనకు బాగా సూటయ్యే ఫుల్ లెంగ్త్ కామెడీ జానర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రంబా ఊర్వశి మేనక'. ఫాంటసీ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమాపై ఆసక్తిని పెంచిన మేకర్స్.. తాజాగా ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. వినూత్నమైన కథాంశంతో పాటు అల్లరి నరేష్ మార్క్ కామెడీని జోడించిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'రంబా ఊర్వశి మేనక' కథ మొత్తం ఒక క్రేజీ ఫాంటసీ కాన్సెప్ట్ చుట్టూ తిరుగుతున్నట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఇంద్రలోకానికి చెందిన ముగ్గురు అప్సరసలు రంభ, ఊర్వశి, మేనక అనూహ్యంగా భూమిపైకి వస్తారు. అంతేకాదు.. వారు నేరుగా హీరో ఇంటికి చేరి అక్కడే నివసించడం మొదలుపెడతారు. అల్లరి నరేష్ పోషిస్తున్న సూర్య పాత్ర మొదట వీరి రాకను తన అదృష్టంగా భావిస్తుంది. తన జీవితంలో ఉన్న అన్ని సమస్యలు ఇక తొలగిపోతాయని, తన తలరాత మారిపోతుందని సంతోషపడతాడు. కానీ కొద్దికాలానికే అసలు విషయం తెలిసి హీరో షాక్ అవుతాడు. రంభ, ఊర్వశి, మేనకలకు ఉన్న దివ్యశక్తులను స్వయంగా ఇంద్రుడే తొలగించినట్లు ట్రైలర్‌లో చూపించారు. ఈ సినిమాలో ఇంద్రుడి పాత్రను వెన్నెల కిషోర్ పోషిస్తున్నారు. సంప్రదాయంగా ఊహించే ఇంద్రుడి పాత్రకు భిన్నంగా, మోడ్రన్ టచ్‌తో కామెడీ పండించేలా వెన్నెల కిషోర్ పాత్రను డిజైన్ చేసినట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తోంది.




## సర్దార్ 2.. కార్తీ లుక్ అదుర్స్

కోలీవుడ్ నటుడు కార్తీ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం సర్దార్. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సీక్వెల్ సర్దార్ 2 వస్తుందని తెలిసిందే. మిషన్ కంబోడియా నేపథ్యంలో సాగే సర్దార్ 2లో తంగలాన్ ఫేం మాళవిక మోహనన్, అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సి.ఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రం నుంచి మ్యూజికల్ ప్రమోషనల్ అప్‌డేట్ వచ్చింది. సర్దార్ 2 ఫస్ట్ సింగిల్‌ను మంగళవారం లాంచ్ చేయనున్నట్టు తెలియజేస్తూ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. పోస్టర్‌లో కార్తీ మురుగన్ శూలాన్ని చేతపట్టుకొని ఉండగా.. మరోవైపు నెమళ్లను చూడొచ్చు. తాజా లుక్ సాంగ్ ఎలా ఉండబోతుందని క్యూరియాసిటీ పెంచుతోంది.

## ఆత్మకథగా రజనీకాంత్ ప్రస్థానం



సూపర్‌స్టార్ రజనీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, జీవిత అనుభవాలను పుస్తక రూపంలో అభిమానులకు అందించబోతున్నారని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య రజనీకాంత్ వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... ఆ పుస్తకం తయారీ ప్రాసెస్ చాలా ప్రత్యేకంగా సాగుతోందని తెలిపారు. రజనీకాంత్ ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలోని విజయాలు, వ్యక్తిగత అనుభవాలు, అగ్రస్థానానికి చేరుకునే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లతో ఈ పుస్తకం రూపుదిద్దుకుంటోంది. పరమహంస యోగానంద రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకంలాగే ఈ పుస్తకం కూడా తరతరాలకు స్ఫూర్తినిస్తుందని సౌందర్య నమ్మకం వ్యక్తం చేశారు. ఒకవేళ తన తండ్రి జీవితాన్ని సినిమాగా తెరకెక్కించే అవకాశం వస్తే అది తనకు అత్యంత ప్రత్యేకమైన విషయమని ఆమె తెలిపారు.

## 50 భాషల్లో 'వారణాసి'

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'ఆర్‌ఆర్‌ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా చాటిన రాజమౌళి.. ఈసారి మరింత భారీ కాన్వాస్‌తో ప్రపంచ ప్రేక్షకులను టార్గెట్ చేస్తున్నారు. దాదాపు రూ.1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం.






## 'రాకా'లో ఐశ్వర్యలక్ష్మి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు.



## న్యూజిలాండ్‌లో ప్రిన్స్ సెసిల్ పెళ్లి

టాలీవుడ్ నటుడు ప్రిన్స్ సెసిల్ జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. 'బస్ స్టాప్', 'డీజే టిల్లు' వంటి చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ప్రిన్స్ సెసిల్ తన ప్రేయసి సాయి ప్రతిమతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. న్యూజిలాండ్‌లోని అందమైన వనకా నగరంలో ఇరు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహ వేడుక ఘనంగా జరిగింది.

## అదిరిపోయేలా 'మహాకాళి' గ్లింప్స్

'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ



రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది. క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బ అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది.



## మిస్ యూనివర్స్.. ఊర్వశి హోయలు

నటి, మాజీ అందాల రాణి ఊర్వశి రౌతేలా మరోసారి వార్తల్లో నిలిచారు. మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు ఆమె వరుసగా నాలుగోసారి న్యాయనిర్ణేతగా వ్యవహరించి ప్రత్యేకతను చాటుకున్నారు. అయితే, ఈసారి ఈ కార్యక్రమం ఆమెకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం అయింది. తన కెరీర్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన, తన గురువుగా భావించే సుస్మితా సేన్‌తో వేదిక పంచుకోవడంతో ఊర్వశి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా తన గురువు సుస్మితా సేన్‌తో ఉన్న అనుబంధాన్ని ఊర్వశి పంచుకున్నారు. "నా మొదటి మెంటర్, నా గురువు, మన దేశపు తొలి మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో ఈ క్షణాలను పంచుకోవడం అనంతమైన ఆనందాన్ని ఇస్తోంది. నాకు ఎగరడానికి రెక్కలిచ్చిన మహిళ ఆమె. సాధారణంగా ఆమె ఎవరికీ అలా చేయరు, కానీ నా పట్టాభిషేకం రోజున స్వయంగా ఆమే నాకు కిరీటాన్ని అలంకరించారు. అది నా జీవితంలో అత్యంత మధురమైన, మరచిపోలేని క్షణాల్లో ఒకటి" అంటూ ఊర్వశి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.



# పంత్.. ధోనీ రికార్డు బద్దలు

భారత యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. విదేశీ గడ్డపై లేదా తటస్థ వేదికలపై జరిగిన టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉండగా, శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో పంత్ ఆ రికార్డును అధిగమించాడు. ఈ మ్యాచ్‌కు ముందు ధోనీ 2,496 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా, పంత్ తాజా ఇన్నింగ్స్‌తో 2,501 పరుగుల మైలురాయిని చేరుకుని ధోనీని వెనక్కి నెట్టాడు. దూకుడైన బ్యాటింగ్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పంత్, అతి తక్కువ సమయంలోనే ఈ ఘనత సాధించడం విశేషం. ఈ జాబితాలో ధోనీ, పంత్ తర్వాత ఫరూఖ్ ఇంజినీర్ (1,209), సయ్యద్ కిర్మాణీ (1,109), కిరణ్ మోరే (901) వంటి దిగ్గజాలు చాలా వెనుకబడి ఉండటం గమనార్హం. ఇదే మ్యాచ్‌లో పంత్ మరో అరుదైన ఘనతను కూడా అందుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 100 సిక్సర్ల క్లబ్‌లో చేరిన మూడో ఆటగాడిగా నిలిచాడు. ప్రస్తుతం పంత్ ఖాతాలో 101 సిక్సర్లు ఉన్నాయి. తనదైన దూకుడుతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే పంత్, టెస్టుల్లోనూ వన్డే తరహా ఆటతీరుతో జట్టుకు కీలక విజయాలు అందిస్తున్నాడు. ఈ రికార్డులతో భారత టెస్ట్ క్రికెట్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు.

# కష్టాల్లో శ్రీలంక



## రెండోరోజు భారత్‌దే ఆధిపత్యం

**కొలంబో వేదికగా భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి శ్రీలంక 2 వికెట్ల నష్టానికి 8 పరుగులు చేసింది. కమిల్ మిషారా 5 పరుగులతో క్రీజులో ఉన్నాడు.**

మానవ్ సుతార్, ప్రసిధ్ క్రిష్ణలు చెరో వికెట్ తీశారు. ప్రస్తుతం లంక 495 పరుగుల వెనుకబడి ఉంది. మొదటి రోజులాగే రెండో రోజు ఆటలో కూడా భారత్‌దే ఆధిపత్యం. పడిక్కల్, జురెల్ శతకాలతో చెలరేగితే, ఆ తర్వాత బౌలింగ్‌లో మానవ్ సుతార్, ప్రసిధ్ క్రిష్ణలు చెలరేగడంతో లంకకు ఆదిలోనే షాకులు తగిలాయి. అంతకముందు తమ తొలి ఇన్నింగ్స్‌ను టీమిండియా 9 వికెట్ల నష్టానికి 503 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.



బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత బ్యాటర్లు చెలరేగడంతో తొలి టెస్టు తరహాలోనే రెండో టెస్టులోనూ భారత్ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. దేవదత్ పడిక్కల్ (193 బంతుల్లో 117), ధ్రువ్ జురెల్ (115 నాటౌట్)సెంచరీలతో చెలరేగారు. మిగతా బ్యాటర్లలో వికెట్ కీపర్ రిషబ్ పంత్ (63), కెప్టెన్ గిల్ (50) అర్ధసెంచరీలు సాధించగా, జైస్వాల్ (45), జడేజా (43) రాణించారు. లంక బౌలర్లలో అసితా ఫెర్నాండో 4 వికెట్లు తీయగా, కెషారా నువంతా, ప్రబాత్ జయసూరియ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 300/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన టీమిండియా 307 పరుగుల వద్ద డెబ్యూ ఆటగాడు సారాంశ్ జైన్ (6) ఔట్ కావడంతో ఆరో వికెట్ కోల్పోయింది. మొదటి రోజు ఆటలో గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషబ్ పంత్ మళ్లీ క్రీజులోకి వచ్చాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి పంత్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ ఇద్దరు కలిసి ఏడో వికెట్‌కు 152 బంతుల్లో 112 పరుగులు జోడించారు. ఈ క్రమంలోనే పంత్, జురెల్‌లు హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. వర్షం అంతరాయంతో టీ బ్రేక్ సమయానికి భారత్ 8 వికెట్ల నష్టానికి 475 పరుగుల వద్ద నిలిచింది. వర్షం తర్వాత భారత్ ఇన్నింగ్స్ ఎక్కువ సేపు సాగకపోయినప్పటికీ, జురెల్ తన కెరీర్‌లో రెండో టెస్టు సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ తర్వాత సిరాజ్ (3) ఔటవ్వడంతో భారత్ 489 పరుగుల వద్ద తొమ్మిదో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత జురెల్ ఒక సిక్సర్ సహా రెండు ఫోర్లు కొట్టడంతో టీమిండియా స్కోరు 500 పరుగుల మార్క్ దాటింది. వెంటనే కెప్టెన్ గిల్ 503 పరుగుల వద్ద భారత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు.



## ధ్రువ్ జురెల్ జై జవాన్.. జై కిసాన్!

కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా బ్యాటర్ ధ్రువ్ జురెల్ సూపర్ సెంచరీతో మెరిశాడు. టెస్టుల్లో ఏడో స్థానం లేదా అంతకంటే తక్కువ స్థానంలో వచ్చి సెంచరీ బాదిన రెండో భారత బ్యాటర్‌గా జురెల్ రికార్డులకెక్కాడు. సెంచరీ చేసిన వెంటనే గాలిలోకి పిడికిలి బిగించిన జురెల్, ఆ తర్వాత హెల్మెట్ తీసేసి కండలను ప్రదర్శించడం హైలైట్‌గా నిలిచింది. అయితే అతడి ఎడమ చేతి బైసిప్స్‌పై పచ్చబొట్టు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. జురెల్ చేతిపై ఉన్న టాటూ ఏంటా అని అభిమానులు ఆరా తీయగా.. 'జై జవాన్.. జై కిసాన్' అని రాసి ఉండడం కనిపించింది. మ్యాచ్ అనంతరం



నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కండలను ప్రదర్శించడం వెనుక దాగున్న అసలు విషయాన్ని ధ్రువ్ జురెల్ పంచుకున్నాడు. 'కండల ప్రదర్శన ఊరికే చేయలేదు. మా తాత రైతు, తండ్రి సైనికుడు. వారి మూలాలను ఎప్పటికీ మర్చిపోకూడదనే ఉద్దేశంతోనే కండల ప్రదర్శనతో సెలబ్రేషన్ చేసుకున్నా. ఆ టాటు వెనుక ఉన్న అర్ధం కూడా అదే' అని జురెల్ చెప్పుకొచ్చాడు. సెంచరీ తర్వాత తాను చేసిన సెలబ్రేషన్స్ కూడా తన కుటుంబానికి అంకితం చేశానని జురెల్ పేర్కొన్నాడు. ఇక, తాను సెంచరీ చేయడం వెనుక లంక ఆటగాడు నిరోషన్ డిక్‌వెల్లా కూడా ఒక కారణమని జురెల్ పేర్కొన్నాడు. మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జురెల్ మాట్లాడుతూ.. "నేను క్రీజులోకి వచ్చిన వెంటనే డిక్‌వెల్లా నీకు దమ్ముంటే ఇక్కడ సెంచరీ చేసి చూపించు. కానీ నువ్వు అది చేయలేవు అని సవాల్ విసిరాడు. కానీ ఆ క్షణంలో నేనేమీ మాట్లాడలేదు. నోటితో కాకుండా బ్యాట్‌తో సమాధానం చెప్పాలని అనుకున్నా. నేను అనుకున్నట్లుగానే ఓపికను ప్రదర్శించి అద్భుత సెంచరీతో అజేయంగా నిలిచాను. ఆ తర్వాత డిక్‌వెల్లా దగ్గరకు వెళ్లి నువ్వు అడిగింది నేను చేసి చూపించాను.. ఇప్పుడు నువ్వేం చేస్తావు అని అడిగాను. కానీ అతడి నుంచి మాత్రం ఎలాంటి సమాధానం రాలేదు." అని చెప్పుకొచ్చాడు.

# సెమీస్ చేరకుండానే ఇంటిబాట



హాకీ ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు ఆట ముగిసింది. సెమీస్ చేరాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన భారత్ ఇంటిబాట పట్టింది. పూల్-ఇలో భాగంగా అర్జెంటీనా చేతిలో 5-3 తేడాతో భారత్ ఓటమిని చవిచూసింది. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో మొదటి క్వార్టర్‌లో మూడు గోల్స్ నమోదయ్యాయి. అర్జెంటీనా రెండు గోల్స్ ఆధిక్యంలోకి దూసుకెళ్లగా, భారత్ ఒక గోల్ చేసి ఆధిక్యాన్ని తగ్గించింది. కేవలం 39 సెకన్లలోనే అర్జెంటీనా ఆటగాడు జోక్విన్ టోస్కాని తొలి గోల్ చేయగా, కొన్ని నిమిషాల తర్వాత నికోలస్ డి లా టోర్రే మరో గోల్ కొట్టి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. అయితే భారత్ తరపున సుఖ్‌జీత్ సింగ్ భారత్ తరఫున తొలి గోల్ చేసి ఆధిక్యాన్ని 2-1కి తగ్గించాడు. ఇక మూడో క్వార్టర్‌లో టోమాస్ డోమెన్ అర్జెంటీనా తరఫున మరో రెండు గోల్స్ సాధించి జట్టు ఆధిక్యాన్ని 4-1కి పెంచాడు. చివరి క్వార్టర్‌లో టొస్కానీ మరో గోల్ కొట్టడంతో ఆ జట్టు గోల్స్ సంఖ్య ఐదుకు పెరిగింది. ఆఖర్లో సుఖ్జీజ్ మరో గోల్‌తో మెరవడంతో ఆధిక్యం 5-2కు తగ్గింది. మరో నిమిషంలో ఆట ముగుస్తుందనగా భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీనిని సద్వినియోగం చేసుకుంటూ సుఖ్‌జీత్ సింగ్ గోల్‌గా మలిచినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.




# మహిళల ఏపీఎల్ వేలం నేడే

## విజయవాడలో గ్రాండ్‌గా నిర్వహణ

ఆంధ్రప్రదేశ్‌లో మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ 2026కు సర్వం సిద్ధమైంది. ఈ లీగ్‌లో తొలి అడుగుగా క్రీడాకారిణుల వేలం ప్రక్రియ ఆగస్టు 25, మంగళవారం విజయవాడలో జరగనుంది. రాష్ట్రంలో పూర్తిస్థాయి ఫ్రాంచైజీ ఫార్మాట్‌లో మహిళల టీ20 లీగ్ నిర్వహించడం ఇదే తొలిసారి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ వేలంలో మొత్తం 191 మంది క్రీడాకారిణులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అమరావతి ఇ-ఛాంపియన్స్, రాయలసీమ జెన్ స్టార్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్ పేరుతో నాలుగు ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొననున్నాయి. ప్రతి ఫ్రాంచైజీ గరిష్ఠంగా రూ. 15 లక్షల పర్స్‌తో బరిలోకి దిగనుండగా, కనీసం రూ. 13.5 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక్కో జట్టులో 18 నుంచి 20 మంది క్రీడాకారిణులను ఎంపిక చేసుకోవాలి. వేలం కోసం క్రీడాకారిణులను రెండు గ్రేడ్‌లుగా విభజించారు. భారత జట్టుకు, డబ్ల్యూపీఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన వారితో పాటు సీనియర్, అండర్-23 రాష్ట్ర స్థాయి క్రీడాకారిణులను గ్రేడ్-ఏలో చేర్చారు. వీరి కనీస ధర రూ. 50,000గా నిర్ణయించారు. ఇక జిల్లా, జోనల్ స్థాయిలో ఆడిన క్రీడాకారిణులను గ్రేడ్-బిలో ఉంచి, వారి కనీస ధరను రూ. 30,000గా ఖరారు చేశారు. ఇటీవల జరిగిన ఫ్రాంచైజీల బిడ్డింగ్‌లో ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా రూ. 89 లక్షలకు అమరావతి ఇ-ఛాంపియన్స్ జట్టును దక్కించుకుంది. భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ ఆక్షనీర్ శ్వేతా బాల్ ఈ వేలాన్ని నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు జరగనున్న



## జైస్వాల్, ఫెర్నాండోపై ఐసీసీ కఠిన చర్యలు

రెండో టెస్టు తొలి రోజే మైదానంలో చోటుచేసుకున్న వివాదంపై ఐసీసీ చర్యలు తీసుకుంది. భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండోకు జరిమానా విధించింది. ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. చెరో డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. 'సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్' మైదానంలో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజున 17వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. ఫెర్నాండో వేసిన బంతికి జైస్వాల్ బౌల్డ్ అయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో బౌలర్ ఏదో అన్నట్లు జైస్వాల్ భావించాడు. దీంతో తిరిగి వచ్చి ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరూ దాదాపు తలలు తాకించుకున్నారు. వెంటనే సహచరులు జోక్యం చేసుకుని వారిని విడదీశారు. ఇద్దరూ ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు తేలింది. అంతర్జాతీయ మ్యాచ్‌లో ఆటగాడు, సహాయక సిబ్బంది, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచితంగా శారీరకంగా వ్యవహరించడాన్ని ఈ నిబంధన తప్పుబడుతుంది. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఈ శిక్షలను ప్రతిపాదించారు. జైస్వాల్, ఫెర్నాండో తప్పును అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే చర్యలు ఖరారయ్యాయి. గత 24 నెలల్లో ఇద్దరికీ డీమెరిట్ పాయింట్లు లేకపోవడం గమనార్హం. జైస్వాల్ తీరుపై క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందించారు. ఔటైన తర్వాత జైస్వాల్ నేరుగా వెళ్లిపోవాల్సిందని సూచించారు. దీనిపై జైస్వాల్ ఘాటుగా స్పందించాడు. ఏం జరిగిందో తెలియకుండా తీర్పు ఇవ్వొద్దని కోరాడు.

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# అభివృద్ధేనా.. శాంతి భద్రతలేవి?

ఏ రాష్ట్ర ప్రగతికైనా, ఆర్థికాభివృద్ధికైనా ప్రాథమిక పునాది పటిష్టమైన శాంతిభద్రతలు. కానీ, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో నెలకున్న పరిస్థితులు ఈ ప్రాథమిక సూత్రానికే సవాలు విసురుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు నానాటికీ దిగజారుతున్న తీరు సామాన్య ప్రజల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. పాలకుల ఉదాసీనత, వ్యవస్థల వైఫల్యం వెరసి రాష్ట్రం అసురక్షిత వాతావరణంలోకి నెట్టబడుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, నిరంతర కక్షసాధింపు చర్యలు ప్రజాస్వామ్య మనుగడనే ప్రశ్నిస్తున్నాయి. భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన రాజకీయ వేదికలు, భౌతిక దాడులకు మరియు వ్యక్తిగత దూషణలకు కేంద్రాలుగా మారుతున్నాయి. శాంతిభద్రతలను నిష్పక్షపాతంగా కాపాడాల్సిన పోలీసు వ్యవస్థపై అదృశ్య రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయన్న ఆరోపణలు సామాన్యుల నమ్మకాన్ని సడలిస్తున్నాయి. ప్రశ్నించే గొంతులను నిర్బంధాలతో అణిచివేసే ప్రయత్నాలు రాష్ట్రంలో ఒక అప్రకటిత భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రాజకీయాలు పక్కన పెడితే, రోజువారీ జీవితంలో సామాన్య పౌరుల భద్రత కూడా గాలిలో దీపంగా మారింది. మహిళలు, చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలు రాష్ట్రంలో రక్షణ వ్యవస్థ డొల్లతనాన్ని ఎత్తిచూపుతున్నాయి. నేరస్తుల్లో చట్టం పట్ల, పోలీసుల పట్ల భయం సన్నగిల్లడం వల్లే పట్టపగలు బహిరంగ దాడులు, హత్యలు పెచ్చుమీరుతున్నాయి. ఆస్తుల కబ్జాలు, బెదిరింపులు లాంటి సంఘ వ్యతిరేక శక్తుల ఆగడాలు సామాన్యుడి జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర ప్రతిష్టను కాపాడాలన్నా, యువతకు ఉపాధి కల్పించే పెట్టుబడులను ఆకర్షించాలన్నా పటిష్టమైన శాంతిభద్రతలు అత్యవసరం. పోలీసు విభాగానికి పూర్తి విధి నిర్వహణా స్వేచ్ఛనిచ్చి, స్వతంత్రంగా వ్యవహరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నేరాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించే జవాబుదారీతనం పాలనా వ్యవస్థల్లో కనిపించాలి. నిజమైన అభివృద్ధి కేవలం కాంక్రీటు భవనాలు, సంక్షేమ పథకాల్లో మాత్రమే లేదు; ప్రజలు ప్రశాంతంగా, నిర్భయంగా జీవించగలిగే వాతావరణంలో ఉంది. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గ్రహించి, క్షీణిస్తున్న శాంతిభద్రతలను గాడిన పెట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఆకలి నుంచి ఆర్థిక శక్తిగా!

**భారతదేశ సామాజిక-ఆర్థిక చరిత్ర కేవలం స్థూల దేశీయోత్పత్తి, పారిశ్రామికీకరణ, వ్యవసాయ వృద్ధి గణాంకాల చరిత్ర కాదు. పేదరికం నుంచి అభివృద్ధి వైపు, నిరక్షరాస్యత నుంచి విద్య వైపు, సంప్రదాయ జీవన విధానం నుంచి ఆధునిక సాంకేతిక సమాజం వైపు సాగిన సుదీర్ఘ పరిణామ ప్రయాణం. 1947లో ఆర్థికంగా బలహీనమైన దేశంగా స్వాతంత్ర్యం పొందిన భారత్, 2026 నాటికి ప్రపంచ ప్రధాన ఆర్థిక శక్తులలో ఒకటిగా ఎదిగింది. అయితే ఈ ప్రయాణంలో విజయాలతో పాటు పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, సామాజిక వివక్ష, ప్రాంతీయ వ్యత్యాసాలు, విద్య-ఆరోగ్య లోపాలు, మహిళల పరిమిత ఆర్థిక భాగస్వామ్యం, పర్యావరణ సమస్యలు వంటి సవాళ్లు కొనసాగుతూనే ఉన్నాయి.**





**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

**1947లో** భారత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయాధారితమైనది. పారిశ్రామిక రంగం పరిమితంగా ఉండేది. దేశ విభజన, ఆహార కొరత, తక్కువ అక్షరాస్యత, అధిక పేదరికం, బలహీన మౌలిక సదుపాయాలు దేశ నిర్మాణానికి పెద్ద అవరోధాలుగా నిలిచాయి. 1951లో మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది. వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్, విద్య, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. తదనంతర దశాబ్దాల్లో భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు, శాస్త్ర-సాంకేతిక సంస్థలు, మౌలిక వసతుల నిర్మాణంపై దృష్టి పెట్టారు. 1950-60 దశకాల్లో భారతదేశం ఎదుర్కొన్న ప్రధాన సమస్య ఆహార భద్రత. వరుస కరువులు, తక్కువ వ్యవసాయ ఉత్పాదకత, సంప్రదాయ సాగు పద్ధతులు, నీటిపారుదల కొరత కారణంగా ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది. 1960ల మధ్యలో ఈ సంక్షోభం తీవ్రతరం కావడంతో వ్యవసాయ రంగంలో సాంకేతిక మార్పులకు దేశం మొగ్గుచూపింది. అధిక దిగుబడి విత్తనాలు, ఎరువులు, నీటిపారుదల, వ్యవసాయ యాంత్రీకరణ ఆధారంగా హరిత విప్లవం ప్రారంభమైంది. 1970-80 దశకాలలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి భారత్ ఆహార స్వయం సమృద్ధి దిశగా సాగింది. ఇది స్వాతంత్ర్యానంతర భారతదేశం సాధించిన గొప్ప విజయాలలో ఒకటి. అయితే హరిత విప్లవం ప్రయోజనాలు అన్ని ప్రాంతాలకు సమానంగా చేరలేదు. నీటిపారుదల, పెట్టుబడి, సాంకేతిక సౌకర్యాలు ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందగా, వర్షాధార ప్రాంతాలు వెనుకబడ్డాయి. చిన్న, సన్నకారు రైతులు అప్పులు, పెరుగుతున్న సాగు వ్యయాలు, ధరల అస్థిరత, నీటి కొరత, వాతావరణ మార్పుల సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నారు. నేడు వ్యవసాయ సమస్యకు పరిష్కారం కేవలం ఉత్పత్తి పెంచడంలో లేదు. ఉత్పత్తి వ్యయం తగ్గించడం, మార్కెట్ ప్రాప్యత, నిల్వ సౌకర్యాలు, పంటల వైవిధ్యీకరణ, విలువ ఆధారిత ఉత్పత్తులు, పంట బీమా, నీటి నిర్వహణ కీలకంగా మారాయి. వాతావరణ మార్పు కారణంగా అనిశ్చిత వర్షపాతం, కరువులు, వరదలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి సంరక్షణ భారత వ్యవసాయ భవిష్యత్తుకు అత్యంత అవసరం.

### 1991 సంస్కరణలు.. కొత్త ఆర్థిక అధ్యాయం

1991 భారత ఆర్థిక చరిత్రలో కీలక మలుపు. విదేశీ మారక నిల్వల సంక్షోభం, చెల్లింపుల సమతుల్యత సమస్యలు, ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. నియంత్రణలు తగ్గించడం, ప్రైవేటు రంగానికి అవకాశాలు విస్తరించడం, విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరవడం, ప్రభుత్వ రంగ సంస్థల పాత్రను పునర్నిర్వచించడం వంటి మార్పులు చోటుచేసుకున్నాయి. దీని తర్వాత సేవారంగం, సమాచార సాంకేతికత, టెలికాం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, వాణిజ్యం వేగంగా విస్తరించాయి. భారత మధ్యతరగతి పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో దేశ అనుసంధానం బలపడింది. అయితే అధిక వృద్ధి అంటే స్వయంచాలకంగా సామాజిక సమానత్వం ఏర్పడుతుందని చెప్పలేం. సంపద సృష్టి పెరిగినప్పటికీ దాని పంపిణీలో అసమానతలు కొనసాగాయి. ఒకవైపు ఆధునిక నగరాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచస్థాయి సంస్థలు ఎదిగితే మరోవైపు అస్థిర ఉపాధి, జీవన వ్యయాల పెరుగుదల, తక్కువ ఆదాయం సమస్యలు కోట్లాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్నాయి. అందుకే 21వ శతాబ్దపు భారత విధానంలో "ఎంత వృద్ధి?" అనే ప్రశ్నతో పాటు "ఎవరికి వృద్ధి?" అన్న ప్రశ్న కూడా కీలకం. భారత సామాజిక పరివర్తనలో విద్య అత్యంత శక్తివంతమైన సాధనం. 1951లో అక్షరాస్యత సుమారు 18 శాతం ఉండగా, 2011 జనగణన నాటికి 74 శాతానికి పైగా పెరిగింది. ఇది భారీ పురోగతి. అయితే అక్షరాస్యత పెరగడం మాత్రమే నాణ్యమైన విద్యకు సూచిక కాదు. పాఠశాలల్లో చేరిక, మధ్యలో చదువు మానేయడం, నేర్చుకునే సామర్థ్యం, ఉపాధ్యాయుల నాణ్యత, డిజిటల్ విద్య, ఉన్నత విద్య ప్రాప్యత వంటి సమస్యలు ఇంకా ఉన్నాయి. ముఖ్యంగా పేద, గ్రామీణ, సామాజికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండటం సమాన అవకాశాలకు కీలకం. ఉన్నత విద్య కూడా విస్తరించింది. కానీ విద్యాసంస్థలు పట్టాలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి కేంద్రాలుగా మారాలి. విద్య-ఉపాధి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించకపోతే డిగ్రీల సంఖ్య పెరిగినా నిరుద్యోగ సమస్య కొనసాగుతుంది.

ఆరోగ్య రంగంలో పురోగతి

స్వాతంత్ర్యం తర్వాత ఆయుర్దాయం పెరిగింది. టీకా కార్యక్రమాలు విస్తరించాయి. శిశు, తల్లి మరణాలు తగ్గాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఆరోగ్య మౌలిక వసతులు, గ్రామీణ వైద్య సేవలు, పోషకాహారం, వైద్యుల అందుబాటు, అధిక వైద్య ఖర్చులు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. ఒక కుటుంబ సభ్యుడి తీవ్రమైన అనారోగ్యం కుటుంబ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేసే పరిస్థితి ఇప్పటికీ ఉంది. అందువల్ల ఆరోగ్యాన్ని కేవలం వైద్య రంగంగా కాకుండా ఆర్థిక భద్రత సమస్యగా కూడా చూడాలి. ప్రాథమిక ఆరోగ్య సేవలు, ముందస్తు నిర్ధారణ, పోషకాహారం, తల్లి-శిశు ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం పెరగాలి. భారతదేశ యువ జనాభా గొప్ప అవకాశమే. కానీ విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, ఉపాధి మధ్య సమన్వయం లేకపోతే అదే జనాభా ఆర్థిక ఒత్తిడిగా మారవచ్చు. విద్య ఉన్నప్పటికీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు లేకపోవడం, నైపుణ్యం ఉన్నప్పటికీ తగిన ఉద్యోగాలు లేకపోవడం, ఉద్యోగం ఉన్నప్పటికీ ఆదాయం జీవన వ్యయాలకు సరిపోకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. కాబట్టి యువతకు ఉద్యోగాల సంఖ్య పెరగడమే కాదు; ఉత్పాదకమైన, స్థిరమైన, గౌరవప్రదమైన ఉపాధి అవసరం. భారత ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత రంగం ఇప్పటికీ కోట్లాది కుటుంబాలకు జీవనాధారం. ఈ రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, ఆదాయ స్థిరత్వం, ఉద్యోగ భద్రత పరిమితంగా ఉన్నాయి. భవిష్యత్ కార్మిక విధానాలు ఉద్యోగాల సంఖ్యతో పాటు ఉపాధి నాణ్యతను కూడా ప్రధాన ప్రమాణంగా తీసుకోవాలి. పట్టణీకరణ అభివృద్ధికి అవకాశం అయినప్పటికీ సమస్యలను కూడా పెంచుతోంది. గ్రామీణ యువత ఉపాధి కోసం నగరాలకు వలస వెళుతున్నారు. నగరాల్లో గృహాలు, రవాణా, తాగునీరు, పారిశుధ్యం, కాలుష్యం, వ్యర్థ నిర్వహణ సమస్యలు తీవ్రమవుతున్నాయి. 2020 కోవిడ్ మహమ్మారి వలస కార్మికుల అస్థిరతను దేశం ముందుకు తెచ్చింది. ఉపాధి, ఆదాయం, నివాస భద్రత కోల్పోయిన లక్షలాది కార్మికులు స్వగ్రామాలకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇది అసంఘటిత రంగం బలహీనతను, సామాజిక భద్రత అవసరాన్ని స్పష్టంగా చూపించింది. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి, చిన్న పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ మౌలిక వసతులు పెంచాలి. వలస అనివార్యతగా కాకుండా అవకాశంగా మారే పరిస్థితి సృష్టించాలి.

### మహిళల ఆర్థిక సాధికారతే అభివృద్ధి బలం

మహిళల భాగస్వామ్యం లేకుండా భారతదేశ సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగం, పరిపాలన, వ్యాపారం, రాజకీయాల్లో మహిళలు పురోగతి సాధించినప్పటికీ ఆర్థిక భాగస్వామ్యం, వేతన సమానత్వం, ఆస్తి హక్కులు, భద్రత, కుటుంబ సంరక్షణ బాధ్యతల పంపిణీ వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. మహిళలు నిర్వహించే కనిపించని సంరక్షణ శ్రమకు ఆర్థిక విలువ చాలాసార్లు లెక్కించబడదు. స్వయం సహాయక సంఘాలు గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు మార్గం చూపాయి. కానీ రుణాలు ఇవ్వడమే సరిపోదు. మార్కెట్, శిక్షణ, సాంకేతికత, బ్రాండింగ్, డిజిటల్ వాణిజ్య అవకాశాలు అందుబాటులోకి రావాలి. భారత సమాజంలో కులం, వర్గం, లింగం, ప్రాంతం చారిత్రకంగా ఆర్థిక అవకాశాలను ప్రభావితం చేశాయి. రాజ్యాంగ పరిరక్షణలు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, విద్యా విస్తరణ వల్ల అనేక వెనుకబడిన వర్గాలు పురోగతి సాధించాయి. అయితే సామాజిక న్యాయం కేవలం చట్టపరమైన హక్కులతో పూర్తికాదు. నాణ్యమైన విద్య, భూమి, ఆస్తి, మూలధనం, ఉపాధి, మార్కెట్ ప్రాప్యత, సామాజిక గౌరవం వంటి అంశాల్లోనూ సమాన అవకాశాలు అవసరం. అదేవిధంగా రాష్ట్రాలు, ప్రాంతాలు, జిల్లాల మధ్య అభివృద్ధి వ్యత్యాసాలు కూడా తగ్గాలి. పెట్టుబడులు, పరిశ్రమలు, విద్యా-ఆరోగ్య సంస్థలు కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమైతే అసమానతలు పెరుగుతాయి. 21వ శతాబ్దంలో డిజిటల్ విప్లవం భారత సామాజిక-ఆర్థిక వ్యవస్థను మార్చేసింది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, డిజిటల్ చెల్లింపులు, ప్రత్యక్ష నగదు బదిలీలు, ఆన్‌లైన్ సేవలు, ఈ-వాణిజ్యం సాధారణ జీవితంలో భాగమయ్యాయి. కానీ డిజిటల్ సౌకర్యాలు అందరికీ సమానంగా అందుబాటులో లేవు. గ్రామీణ-పట్టణ, ధనిక-పేద, విద్యావంతులు-నిరక్షరాస్యుల మధ్య డిజిటల్ అంతరం ఉంది. డిజిటల్ అక్షరాస్యత, సైబర్ భద్రత, వ్యక్తిగత సమాచార రక్షణ కొత్త విధాన సవాళ్లుగా మారాయి. కృత్రిమ మేధస్సు ఉపాధి నిర్మాణాన్ని మరింత మార్చబోతోంది. కొన్ని సంప్రదాయ ఉద్యోగాలు తగ్గినా కొత్త ఉద్యోగాలు పుడతాయి. అందువల్ల విద్యా వ్యవస్థ జీవితాంతం నేర్చుకునే సామర్థ్యం, సమస్య పరిష్కారం, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను పెంచాలి. వాతావరణ మార్పు ఇప్పుడు కేవలం పర్యావరణ సమస్య కాదు; సామాజిక-ఆర్థిక సమస్య. వేడి తరంగాలు, అనిశ్చిత వర్షపాతం, వరదలు, కరువులు, నీటి కొరత వ్యవసాయం, కార్మికుల ఉపాధి, ఆహార భద్రత, ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. పర్యావరణ సంక్షోభం ప్రభావం పేద వర్గాలపై ఎక్కువగా పడుతుంది. రైతులు, మత్స్యకారులు, నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు వాతావరణ మార్పులకు మరింత సున్నితంగా ఉంటారు. కాబట్టి ఆర్థిక వృద్ధి, సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతే స్థిరమైన అభివృద్ధికి పునాది.

### పేదరికం తగ్గింది.. కానీ సవాలు పూర్తికాలేదు

భారత సామాజిక-ఆర్థిక చరిత్రలో పేదరికం అత్యంత కీలక అధ్యాయం. స్వాతంత్ర్యానంతర దశాబ్దాల్లో దేశంలో పేదరికం విస్తృతంగా ఉండేది. ఆర్థిక వృద్ధి, వ్యవసాయ పురోగతి, సామాజిక సంక్షేమ పథకాలు, విద్య విస్తరణతో పేదరికం క్రమంగా తగ్గింది. పేదరికాన్ని కొలిచే విధానం కూడా మారింది. ఒకప్పుడు ఆదాయం లేదా వినియోగ వ్యయం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేయగా, ఇప్పుడు విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, నివాసం, వంట ఇంధనం, ఆస్తులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని బహుముఖ పేదరికాన్ని అంచనా వేస్తున్నారు. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం బహుముఖ పేదరికం 2015-16లో 24.8 శాతం నుంచి 2019-21లో 14.96 శాతానికి తగ్గింది. 2022-23 నాటికి అది 11.28 శాతానికి తగ్గినట్లు అంచనా. 2013-14 నుంచి 2022-23 మధ్య సుమారు 24.8 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని అంచనాలు సూచిస్తున్నాయి. ఈ పురోగతి ముఖ్యమైనదే. కానీ పేదరికం పూర్తిగా అంతరించిపోయిందని దీని అర్థం కాదు. నేడు పేదరికం అంటే కేవలం ఆకలి కాదు. స్థిరమైన ఉపాధి లేకపోవడం, నాణ్యమైన విద్యకు దూరం కావడం, అధిక వైద్య ఖర్చులు, సురక్షిత నివాసం లేకపోవడం, డిజిటల్ సేవలకు ప్రాప్యత లేకపోవడం కూడా ఆధునిక పేదరిక స్వరూపాలే.

### 2026లో భారత్ ముందు అసలు ప్రశ్న

1947 నుంచి 2026 వరకు భారత్ అనేక చారిత్రక సవాళ్లను అధిగమించింది. ఆహార కొరత నుంచి ఆహార భద్రత వరకు, నిరక్షరాస్యత నుంచి విద్యా విస్తరణ వరకు, బలహీన ఆర్థిక వ్యవస్థ నుంచి ప్రపంచ ప్రధాన ఆర్థిక శక్తులలో ఒకటిగా ఎదిగే వరకు దేశం ప్రయాణించింది. అయితే ఇప్పుడు ప్రశ్న "భారత్ అభివృద్ధి చెందుతుందా?" అనేది కాదు. "అభివృద్ధి ఫలాలు ప్రతి పౌరుడికి చేరుతున్నాయా?" అనేదే అసలైన ప్రశ్న. దేశ విజయాన్ని కేవలం జీడీపీతో కొలవలేం. వ్యక్తి ఆదాయం, ఉపాధి నాణ్యత, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మహిళల సాధికారత, పర్యావరణ నాణ్యత, సామాజిక భద్రత, అవకాశ సమానత్వం కూడా అభివృద్ధి ప్రమాణాలే. భారతదేశం తదుపరి దశలో ఆర్థిక వృద్ధి, సామాజిక న్యాయం, మానవ అభివృద్ధి , పర్యావరణ పరిరక్షణ , సాంకేతిక సమానత్వం అనే సమగ్ర నమూనాను అనుసరించాలి. 2047 వైపు భారత్ సాగుతున్నప్పుడు లక్ష్యం కేవలం ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం కాకూడదు. పేదరికం, ఆకలి, నిరుద్యోగ భయం, వివక్ష తగ్గిన; నాణ్యమైన విద్య-వైద్యం అందరికీ అందుబాటులో ఉన్న; రైతు, కార్మికుడు గౌరవంగా జీవించే; మహిళలు సమాన అవకాశాలు పొందే; యువత తమ ప్రతిభను దేశ నిర్మాణంలో వినియోగించే సమానత్వ భారతదేశాన్ని నిర్మించడం కావాలి.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.